# దేవుడున్నాడా? ... వుంటే చూపించు!!

"దేవుడున్నాడంటున్నావు? ఉంటే చూపించు!"

"అతడు కంటికి కన్పించకుంటే నమ్మవా?"

"నమ్మను!"

"అయితే కంటికి కన్పించనిదేదీ లేదంటావా?"

"......... ఆ! లేనట్టే!"

"నీకు మనస్సుండబట్టి యిలా అనగలిగావు? అయితే ఆ మనస్సును నాకు చూపగలవా? చూపలేకుంటే నీకు మనస్సులేనట్టే గదా! మనస్సే లేకుంటే అప్పుడు నమ్మేది. యిప్పుడు నమ్మనిది, యిప్పుడిలా అడిగేది ఎవరు? "

"................."

"పోనీ, అంతదాకా ఎందుకు? భూమికి ఆకర్షణశక్తి వున్నదా?"

"ఆ!"

"అయితే దానిని నాకు చూపగలవా?"

"ఊ?..... ఆ, చూపగలను. ఇదిగో యీ అగ్గిపెట్టెను క్రింద జారవిడుస్తున్నాను. క్రిందపడింది. ఇలా ఎన్ని సార్లు పడేసినా అది క్రిందికే పడుతుంది. ప్రతి వస్తువూ అలానే పడుతుంది. భూమికి ఆకర్షణశక్తి లేకుంటే యివన్నీ క్రిందకే ఎందుకు పడుతాయి?"

"నీ తర్కం దెబ్బతిన్నది. ఆ వస్తువులు క్రిందపడటం కన్పిస్తూనే వున్నది. అది కాదనడంలేదు. కాని అందుకు కారణమని నీవు చేప్పే భూమ్యాకర్షణశక్తి కన్పించడంలేదు. దాని ఉనికినెలా అంగీకరిస్తావు? నీవు చెప్పిన ప్రకారం కనిపించనివేవీ లేవు. అంటే వస్తువులు వదుల్తే క్రిందకు పడతాయిగాని, అలా పడటానికి హేతువైన భూమ్యాకర్షణశక్తి కంటికి కనిపించదు గనుక లేదనే చెప్పాలి. ఏమంటావు?"

"అబ్బే, అదెలా పొసగుతుంది? హేతువు లేకుండా ఏదీ సంభవించదు. హేతువు, లేక కార్యకారణ సిద్ధాంతము ఆధునిక విజ్ఞానమంతటికి ఆయువు పట్టు వంటిది గదా!"

"అదే ఆస్తికులమైన మేము చెప్పేది గూడ! **ప్రతి కార్యానికి తప్పక ఒక హేతువుండితీరాలి.** కొన్ని సందర్భాలలో కార్యకారణాలు రెండూ ప్రత్యక్షంగా వుంటాయి-వర్షం కురవడం కారణమైతే, చెరువులునిండడం కార్యం. కొన్ని సందర్భాలలో కార్యం ప్రత్యక్షము, కారణం గుప్తముగా ఉంటాయి. భూమ్యాకర్షణశక్తి గుప్తమైన (అంటే ప్రత్యక్షంగాని) కారణం. వస్తువులు క్రిందిపడడం ప్రత్యక్షం.ఇటువంటి విషయాలలో ప్రత్యక్షమైన కార్యాలను విశ్లేషించి, కారణాన్ని అనుమాన ప్రమాణం చేత బుద్ధితో గుర్తిస్తారు విజ్ఞానవేత్తలుగూడ. **కనుక కంటికి కనుపించకుంటే నమ్మనంటే విజ్ఞానశాస్త్రం ఒక్క అడుగు కూడ ముందుకు పోయేదిగాదు....."**

"అయితే కారణంగూడ ప్రత్యక్షంగా వుండే సందర్భాలలోనైనా నా వాదం సరిపడుతుందేమో?"

**అన్ని హేతువులకూ మూలమైన కారణాన్నే భగవంతుడు, లేక పరమాత్మ అని మేమంటాము. అతడు లేడన్నామంటే సకల సృష్టి ప్రధానంగా నిర్హేతుకమన్నమాట!**

"సరిపడదు. మనకు ప్రత్యక్షంగా కనుపించే కారణాల గూర్చి ఆలోచిస్తే అవి కార్యములుగా ఋజువై, వాటికి కారణాలు పరోక్షాలవుతాయి. వర్షం కార్యమంటే, ఎండవేడికి నీరు ఆవిరై పైకి వెడుతుంది. ఇది ఒక కారణం. అది ధూళిరేణువులతో కలసి వాతావరణ ప్రభావంచేత వర్షపుమేఘంగా ఏర్పడుతుంది, - యిది మరొక హేతువు. ఋతుపవనాల వలన అవి దేశంమీదకొచ్చి వర్షిస్తాయి. వీటిలో ప్రతి ఒక్క హేతువు ఒక కార్యమై, మరలా దానికొక హేతువును అన్వేషించవలసి యుంటుంది. ఒక దశలో యీ కారణాలన్నీ పరోక్షాలై, అనుమాన ప్రమాణంచేత గ్రహించబడి, ప్రయోగాలచేత దృఢపరచబడుతుంది. అంటే మౌలికమైన ప్రతిసత్యము, లేక హేతువు పరోక్షమే. అట్టి అన్ని హేతువులకూ మూలమైన కారణాన్నే భగవంతుడు, లేక పరమాత్మ అని మేమంటాము. అతడు లేడన్నామంటే సకల సృష్టి ప్రధానంగా నిర్హేతుకమన్నమాట! కంటికి కనుపించనంతమాత్రాన దేవం లేదనడం సరిగాదు! ఏమంటావు?"

"..............................."

**- 'సాయిబాబా'**

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

SRI MANGA BHARDWAJA TRUST

చీఫ్ ఎడిటర్: **శ్రీ పోలూరి శ్రీనివాసరావు** బి.ఎ.ఎల్.ఎల్.బి

ఎగ్జిక్యూటివ్ ఎడిటర్: **డా॥ ఆర్.ఎస్. శశిధర్,** పిహెచ్. డి

**సంపుటి: 28** **అక్టోబర్ 2010** **సంచిక: 6**


శ్రీసాయిబాబాను 'హేమాద్పంతు' (అసలు పేరు అన్నాసాహెబ్ దభోల్కర్) అను భక్తుడు వారి దివ్య చరిత్రను వ్రాయడానికి అనుమతి కోరినపుడు ఆ సద్గురుమూర్తి అతనిని ఆశీర్వదించి తమ లీలలను శ్రద్ధగా పారాయణచేసి, వాటిని గూర్చి మననం చేసిన వారికి అమూల్యమైన జ్ఞాన ధనం లభించగలదని హామీ యిచ్చారు. అంటే శ్రీ సాయీశుడు దివ్యలీలలను ప్రకటించడం కేవలం భక్తులను లౌకికమైన యిక్కట్లనుండి రక్షించడం మాత్రమే కాదన్నమాట. పరిపాకం లేని మానవులు మొదట ఆయననుండి కోరేదదే కావచ్చు గాక! చక్కెర తీపికి వ్యామోహపడిన పిల్లవాడికి తల్లి చక్కెరలో కలిపి అతడి కారోగ్యాన్నిచ్చే మందును తినిపించినట్లు శ్రీసాయి తమ లీలలో గాంభీర్యము, అద్భుతము, ఆధ్యాత్మికమూ అయిన బోధను కలిపి అందిస్తారన్నమాట.

**- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ**

ఈ సంచిక ప్రచురణకు సహకరించిన శ్రీ రాము, శ్రీమతి లలిత, చిరంజివి సృష్టి కుటుంబానికి ఆచార్యులు తమ ఆశీస్సులను కురిపించాలని ప్రార్థన.

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు. శ్రీ మంగభరద్వాజ ట్రస్టుకు ఎటువంటి బాధ్యతా లేదు.

## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | దేవుడున్నాడా? ... వుంటే చూపించు!! | 01 |
| 2. | విజయదశమి సందేశం | 03 |
| 3. | మాస్టరుగారి విశ్వరూపం | 05 |
| 4. | తరింపచేయాలన్నదే వారిద్దరి తపన | 07 |
| 5. | లక్ష్యము–మార్గము–గమ్యము | 09 |
| 6. | శ్రీ సాయి సచ్చరిత్ర | 13 |
| 7. | శ్రీ దత్తలీలామృతము – సీరియల్ | 15 |
| 8. | వార్తాలాపము – సీరియల్ | 18 |
| 9. | ఆధ్యాత్మికత అంటే ఏమిటి? | 21 |
| 10. | అర్థాంగి | 22 |
| 11. | శ్రీ భరద్వాజ రచనామృతం | 27 |
| 12. | పూర్వకర్మ–మహనీయుల కృప | 28 |
| 13. | శ్రీశ్రీశ్రీ రంగన్న బాబుగారు | 30 |
| 14. | మనకిదే శరణ్యం | 31 |



**చందా వివరములు**

| | |
|---|---|
| విడిప్రతి | : రూ. 10-00 |
| సంవత్సర చందా | : రూ. 100-00 |
| జీవిత చందా | : రూ. 1,116-00 |

(సం॥లోపల 5 తేలిక వాయిదాలలో చెల్లించవచ్చును)
(20 సం॥లపాటు మీకు పత్రిక పంపబడుతుంది)

| | |
|---|---|
| రాజపోషకులు | : రూ. 3,000-00 |
| మహారాజపోషకులు | : రూ. 5,000-00 |



**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P,Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500 068
website: www.saibharadwaja.org
www.saimasterforums.org

# విజయదశమి సందేశం

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

శ్రీ సాయిబాబాకు ఉత్తముడైన గురువు లభించడంతో మానవజాతియొక్క ఆధ్యాత్మిక చరిత్రలో ఒక నూతనమైన అధ్యాయం ఆరంభమయింది. వేదకాలంలో గురు-శిష్య సాంప్రదాయానికి ప్రతీకగావేదధర్ముడు-దీపకుడు-ధౌమ్యులవారు-అరణి, బైదుడు, ఉపమన్యువులు శాశ్వతమైన కీర్తి గడించారు అలనాటి ఆ సాంప్రదాయం మరల సాయిబాబా-వారి గురువురూపాలలో పునరావృత్తమయింది. కేవలం గురుకృప వలన, వారిని హృదయ పూర్వకంగా సేవించిన శిష్యుడు సర్వజ్ఞుడవడం వీరిలో ముందుగా చెప్పి సూచించారు. శిరిడీలో వున్న తమ ఐదున్నర అడుగుల శరీరమే తాముగామని, తామే అన్ని రూపాల్లోనూ సర్వత్రా సంచరిస్తున్నామనీ, "నీవుచూచేదంతా కలిసి నేను" అనీ, "ఈ విశ్వమంతా నాలోనేవున్నది" అనీ ఎంత చెప్పినా ఎన్ని లీలలద్వారా తెలియబరిచిచూచినా, మానవజాతి మాత్రం తన అజ్ఞానపు సీమలు ఉల్లంఘించలేకపోయింది. కనుక 1918లో విజయదశమినాడు మనందరి తరపునా ఆయనయే సీమోల్లంఘనం చేశారు. శిరిడీ అనే భౌతిక కేంద్రంనుండి తమశక్తిని ప్రసరింపచేయడంమాని, భక్తులు ఎక్కడ తలిస్తే అక్కడే తమలీలలరూపంలో సాయి ప్రకటమవసాగారు. భక్తుల

**సాయి చేసిన గురుసేవ పరిపూర్ణమై, ఆయన శిరిడీలో వేపచెట్టుక్రింద ప్రకటమవడంతో మానవచరిత్రలో మరొక యుగం ఆరంభమైంది.**

చూడవచ్చు. అంతేగాదు, దక్షిణామూర్తి కేవలం తన మౌనమనే వ్యాఖ్యద్వారా తమ శిష్యుల సర్వ సంశయాలను విచ్ఛినంచేసి జ్ఞానులుగా రూపొందించిన లీల మరలా ఈ గురు శిష్యుల విషయంలో తిరిగి ప్రాణంపోసింది. సూఫీ సాంప్రదాయంలో భారతదేశంలో విజయంచేసిన ముస్లిం మహాత్ములందరికీ తలమానికమనదగిన ఖాజా మొహిద్దీన్ చిస్తీ (అజ్మీర్) గారికి, వారి గురువుకు మధ్య నడిచిన గురులీలగాని, లేక ఖాజా మొహిద్దీన్ చిస్తీ మరియు వారి శిష్యులకు మధ్య నడిచిన లీలగూడ సాయిచరిత్రలోపునరావృత్తమయింది. అంటే సాయిబాబా చరిత్రలో మత సామరస్యమన్నది వారి శుశూష్రతోనే ఆరంభమయింది. సాయివలె వారి గురువుగూడ ఏమతానికి చెందినవారో, వారి పుట్టుపూర్వోత్తరాలేమిటో ఎవరికీ తెలియదు. వారిపేరు రోషన్‌షా అనికొందరితోను, వెంకుసా అని మరికొందరితోను సాయి చెప్పారు.

సాయి చేసిన గురుసేవ పరిపూర్ణమై, ఆయన శిరిడీలో వేపచెట్టుక్రింద ప్రకటమవడంతో మానవచరిత్రలో మరొక యుగం ఆరంభమైంది. అది 58 సం॥లు నడిచాక అక్టోబర్ 15, 1918న వారు మహాసమాధి చెందటంతో మరొక ఘట్టం ఆరంభమయింది. ఆ విషయమున 1916లో విజయదశమినాడు, "ఈరోజే నా సీమోల్లంఘనము!" అని హృదయాలలోనే వారి సీమోల్లంఘనం జరిగింది. అందుకే ఆయన,"నా సమాధి (అదృశ్యంగా) నా భక్తుని చెంతనుండి కాపాడుతుంటుంది'' అని చెప్పారు. ఒక్కమాటలో చెప్పాలంటే-మానవాళిపై వారి ప్రేమ మహత్తరమైన వారి దివ్యశక్తి సంభవాసంభవాలనే సీమలను ఉల్లంఘించి పరవళ్ళు తొక్కుతున్నాయి. ఈనాడు సాయంకాల పుటాకాశంలో

**"నా సమాధి (అదృశ్యంగా) నా భక్తుని చెంతనుండి కాపాడుతుంటుంది"**

ప్రకటమయ్యే నక్షత్రాల లాగా-సాయిమందిరాలు దేశమంతటా వెలుస్తున్నాయి.

ఆకాశంలోని ఆ నక్షత్రాలు అంతటా వెలగడానికి రాత్రి యొక్క చీకట్లే కారణం. శ్రీ సాయి లీలలు యింతగా ప్రకటమవడానికి కారణం మనలోని అనర్హతలే! పరిపూర్ణమైన అర్హతగల సాయికి వారి గురువు ఒక్క లీల గూడ చూపలేదు. సరిగదా, బావిలో తలక్రిందులుగా వ్రేలాడదీయటం ఒక్కటే ఆయన చూపిన ప్రేమ, సాయి మనకు యిన్నిలీలలు

చూపుతున్నా, లెక్కలేనంతమంది దీపపు పురుగులులా ఆయన చెంతకుచేరుతున్నా, యిందరిలోవారి శిష్యుడని చెప్పుకోదగిన వారు ఒక్కరుగూడాలేరు.

"నావద్దకన్నీ చెల్లని నాణాలే వస్తున్నాయి!" అన్నారాయన. అందరూ తమ వారైయినప్పటికీ వారిలో కొందరు రాక్షసులతో ఆయన ప్రేమయుద్ధం అనేలీల కొనసాగిస్తున్నారన్నమాట. చివరకు విజమదశమిరాక తప్పదు; మహిషాసుర మర్ధన, శిష్ఠరక్షణతప్పదు. బంధు, మిత్రులపై మమకారంతోను, దురహంకారంతో గూడిన దౌష్ట్యంతోను అలనాడు మహిషాసురుడు, రావణ కుంభకర్ణాదులు,

**మానవాళిపై వారి ప్రేమ మహత్తర్మైన వారి దివ్యశక్తి సంభవాసంభవాలనే సీమలను ఉల్లంఘించి పరవళ్ళు తొక్కుతున్నాయి.**

దొంగలవుతున్నారనీ, కనుక వారికి తామేమీచేయలేకున్నామనీ ఆయనన్నారు. ఈ ప్రపంచం వెనుకటిలాగాలేదనీ, ప్రతివారికీ ఇతరుల గురించి చెడుగా తలచడమే స్వభావ సిద్ధమవుతున్నదనీ ఆయన చెప్పారు. "సాయిని ఆశ్రయించిన వారందరూ పరమార్ధంపొందుతారా?" అని బాపూసాహెబ్ జోగ్‌కు కల్గిన సందేహానికి ఆయనిచ్చిన సమాధానం: ఎక్కువమంది మామిడి పూత వలె రాలిపోతారనీ, కొద్దిమంది మాత్రవే చెట్టునంటిపెట్టుకున్న కొద్ది మామడి కాయల వలె తమనంటి పెట్టుకుని కృతార్ధులవుతారనీ ఆయన చెప్పారు. అయితే **తాము మాత్రం తమనాశ్రయించిన వారినెవరినీ విడిచి పెట్టక ఏనాటికైనా గమ్యం చేరుస్తామని అభయమిచ్చారు.** ధృతరాష్ట్రుడు, దుర్యోధనాదులు మొ॥న వారిలో వున్న రాక్షసగుణంమనలో గూడ విజృంభిస్తే చివరకు యీ సాయిలీలలో మనకు సర్వనాశనం తప్పదు. అలాగాక నిష్కామంగా ఎన్ని దౌష్ట్యాలకైనా ఓర్చి శ్రీ రాముడు-పాండవులవలె **ధర్మంకోసంపోరాడితే అంతిమ విజయము, సశరీరంగా స్వర్గోరోహణానికీ శ్రీ సాయి మనకిచ్చే అభయానికి పాత్రులమౌతాము.** ఈ ధర్మ యుద్ధం మనజీవితాలలో నిరంతరమూ కొనసాగేదే. సాటివారిపట్ల మమకారానికీ, అహంకారానికీ లోనవుతామో లేక నిష్పాక్షికంగా ఎన్ని కష్టనిష్టూరాలకైనా ఓర్చి ధర్మకోసం పోరాడుతామోనన్న దాన్ని బట్టి మన అడుగులు ఏ మార్గాన నడుస్తాయో మనమే

**ఒకటి రెండు సార్లు హెచ్చరిస్తామనీ వినకుంటే మన కర్మకు మనల్ని విడిచిపెడతామని సాయి హెచ్చరించారు.**

అందుకు అవసరమైన లీల తమ సమాధి నుండే చేస్తామని ఆయన ఎన్నోరీతుల చెప్పారు. అవసరమైనప్పుడు ఈనాటికీ ఆయన పాంచభౌతిక రూపంలో ఎందరెందరో భక్తులకు దర్శన మిస్తూనే వున్నారు. ఈ విషయం తమ సహజ నిగూఢరీతిన ఒకప్పుడు ఆయన చెప్పారు: ఆయన తమ కాలిపై చిన్న మచ్చను భక్తులకు చూపి, "నాకు నారికురుపులేచింది. నేను నారిని తీసివేయటానికి ప్రయత్నిస్తే అది తెగి, మరల నారి కురుపొచ్చింది. అది నేను స్వస్థానానికి వెళితేగాని తగ్గదని విన్నాను. అయితే ఆ విషయం అల్లాహ్‌కేవిడచి పెట్టాను" అని చెప్పారు. "అందరికీ మంచి మార్గానికి మరల్చడమో, లేక నాశనం చేయడమో జరగాలని అల్లాహ్‌ను ప్రార్ధిస్తూన్నాను. కాని ఆయన నా ప్రార్ధన ఆలకించడంలేదు. కానీ నేను చచ్చినా, బ్రతికినా అనుకున్నది సాధించి తీరుతాను" అన్నారని ఖాపర్డే తన డైరీలో వ్రాసాడు. అంటే శ్రీ సాయి మహాశక్తి స్వరూపమన్న మాట. మనలోని నిర్ణయించుకోవాలి. ఒకటి రెండు సార్లు హెచ్చరిస్తామనీ వినకుంటే మన కర్మకు మనల్ని విడిచిపెడతామని సాయి హెచ్చరించారు. మనము ఏమిచేస్తున్నామన్నదే ఈ విజయదశమి- ఈ సాయిబాబాయొక్క 92వ మహాసమాధి ఉత్సవం మనల్ని నిలదీసివేస్తున్న ప్రశ్న. "సాథీ అఖిర్‌కా కియానకోయి" "సాయియే చివరితోడు- వేరెవ్వరూ లేరు. అని ఆరతి పాట మనకు హితబోధ చేస్తున్నది.

# మాస్టరుగారి విశ్వరూపం

శ్రీమతి వేదవతి

పూజ్యశ్రీ మాస్టరుగారు 1939 సం॥లో జన్మించారు. ఆయన 1989సం॥లో మహాసమాధి చెందారు. అంటే 50 సం॥లు భౌతిక శరీరంతో వున్నారు. ఈ 50సం॥లో ఆయన మనకు బోధించినదేమిటి? ఆయన కొంత తన రచనల, బోధలరూపంలో మనకు ఎన్నో విషయాలు బోధించినా, ఆయన ఆచరణ ద్వారా, జీవిత విధానం ద్వారా మనం తెలుసుకోవలసిన విషయాలు చాలా వున్నాయి. వాటిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నించి ఆచరణలో పెట్టినప్పుడే మనం ఆయన జన్మదినాన్ని నిజంగా జరుపుకుంటున్నట్లు. కనుక ఆయన బోధను అర్థంచేసుకోవడానికి ప్రయత్నిద్దాము.

'ఉన్నదానితో అసంతృప్తి లేని దేనికోసమో తపన' ఇదే మానవ జీవిత సారమని మాస్టరుగారు చెప్పారు. ఈ అసంతృప్తి నుంచి తప్పుకోవడానికి, అంతులేని తృప్తి, శాంతి పొందడానికే మానవుడు జీవితంలో ఏదైనా చేస్తాడన్న మాట. అయితే ఎక్కువమంది ఏమి చేసినా అవి దొరకక అసంతృప్తిగానే చనిపోతారు.

సాధన చేయడం సరియైన పద్ధతికాదని ఆయనే చెప్పారు. అంటే మనం ఏ పరిస్థితిలోవున్నా సరే, బాధ్యతలను నిర్వర్తిస్తూ, సరియైన దృక్పథంతో కూడిన జీవిత విధానాన్ని ఏర్పరుచుకుంటూ సాధన కొనసాగించాలన్నమాట! దీనికి మాస్టరుగారి ఆచరణే ప్రమాణం. ఎందుకంటే అది అన్ని ధర్మాలను తనలో యిముడ్చుకుని వుంటుంది. అడుగడుగునా నిత్యజీవితంలో మనకెదురయ్యే సందేహాలకు ఆయన బోధలు, రచనలు, ఆచరణ రూపంలో మనకు చక్కని సమాధానాలు దొరుకుతాయి.

**పుట్టుకనుంచి మరణం వరకు మనం ఎలా జీవించాలో మాస్టరుగారు మనకు చెప్పారు.** పసిపిల్లలతో ఎలా వ్యవహరించాలి, వారికి ఎలాంటి విషయాలు ఎలా నేర్పించాలి, విద్యావిధానం ఎలా వుండాలి, తల్లిదండ్రులు వారికి ఎటువంటి వాతావరణం కల్పించాలి మొ॥న ఎన్నో విషయాలు ఆయన చెప్పారు. అలాగే బ్రహ్మచర్యం ఎలా వుండాలి, ఆ కాలంలో జీవితాన్ని ఎలా సద్వినియోగ పరచుకోవాలి, సామాజికంగాను,

## ఈ కాలంలో మనకు నిజమైన సద్గురువు ఎలా దొరుకుతారు?

**అంతులేని తృప్తి, శాంతిని జీవితంలో పొంది, వాటితో ఎల్లప్పుడూ జీవించేవారే మహాత్ములు. అంటే అవి అసాధ్యాలు కావు. కాబట్టి వాటిని ఎలా పొందాలో వారినుండే తెలుసుకోవాలి. అలా మన స్వభావాన్ననుసరించి మనకు బోధించే ఆత్మజ్ఞాని అయిన సద్గురువును మనం ఆశ్రయించాలి.**

అయితే ఎంతో మంది దొంగ గురువులున్న ఈ కాలంలో మనకు నిజమైన సద్గురువు ఎలా దొరుకుతారు? ఒకవేళ దొరికినా మనకు వారిని ఆశ్రయించి సేవించడం చేతగావాలి కదా! ఈ సమస్యకు పరిష్కారమే శ్రీ గురుచరిత్ర గ్రంథ పారాయణ. ఈ గ్రంథ పారాయణ చేస్తుంటే దత్తస్వామి కలలో కనిపించి సద్గురువును చూపిస్తారు. అంతేకాదు సద్గురువు దొరికాక వారిని ఎలా సేవించాలో ఈ గ్రంథం మనకు తెలుపుతుంది. ఆ ప్రకారం వారిని సేవించడమే మనం చేయవలసినది. ఇలా ఈ గ్రంథ పారాయణ ద్వారా తరించిన మహాత్ములెందరో!

కాని యీ లోపల మనకు ఎన్నో బాధ్యతలుంటాయి కదా! ఆధ్యాత్మిక జీవితానికి లౌకిక జీవితానికి సమన్వయం దొరకాలి కదా! దీనికి మాస్టరుగారు ఒక విషయం చెప్పారు :- 'సరియైన లౌకిక జీవితమే ఆధ్యాత్మిక జీవితం' అని. ముక్కుమూసుకుని ఒంటరిగా

తల్లిదండ్రులపట్ల ఎలా వ్యవహరించాలి, జీవితంలో క్రమశిక్షణ ఎలా అలవరచుకోవాలి మొ॥న ఎన్నో విషయాలు ఆయన బోధలలోనూ, శిక్షణలోనూ మనకు తెలుస్తాయి. ఉద్యోగాన్ని ఎలా ఎంచుకోవాలి, దానిని ఎలా సరిగ్గా నిర్వర్తించాలి, అందులో వుండే అన్యాయాలను ఎలా ధైర్యంగా ఎదుర్కోవాలో మనకు ఆయన తెలిపారు. వివాహం పట్ల దృక్పథం ఎలా వుండాలి, భార్యా భర్తల సంబంధం ఎలా వుండాలి, వారిద్దరూ కలిసి ధర్మంగా ఎలా జీవించాలి, సన్మార్గంలో ఎలా నడవాలి-యీ విషయాలన్నీ ఆయన చర్చించారు. అలాగే బాధ్యతలన్నీ తీరిపోయిన వృధ్యాప్యంలో ఎలా గడపాలో, ఎలాంటి దృక్పథము, జీవిత విధానము వుండాలో, మరణానికి ఎలా సంసిద్ధులవ్వాలో కూడా ఆయన చెప్పారు.

అలాగే దినచర్య ఎలా వుండాలి, నిద్ర, భోజనాలు, స్నానము మొ॥న వాటిని ఏ భావంతో చేయాలో చెప్పారు. ధ్యానం, పారాయణ, సద్గ్రంధపఠన, సత్సంగాలతో రోజును ఎలా నింపుకోవాలి, నిత్యకృత్యాలలో భావం ఎలా వుండాలో చెప్పారు.

వ్యక్తిగతస్థాయిలోనే గాక, సామాజికంగా (సంస్కృతి, కాలక్షేపాలు, రాజకీయాలు మొ॥న ఎన్నో అంశాలలో) ఎలా ధర్మబద్ధంగా జీవించాలో, దేశభక్తితో కూడిన బాధ్యతాయుతమైన

వసుదైక కుటుంబం ఎలా ఏర్పడాలో ఆయన మనకు చెప్పారు. అంటే **వ్యక్తిగత స్థాయినుంచి, సామాజిక, దేశ, ప్రపంచ స్థాయిదాకా మన ఉనికి ఎలా సార్థకమవచ్చో ఆయన వివరించారు.** ఇలా ఆయన విశ్వరూపాన్ని వివరించుకుంటూపోతే ఎన్ని పేజీలూ చాలవు. ఇప్పుడుదహరించినవి మాస్టరుగారనే మహాసముద్రములో కొన్ని బిందువులు మాత్రమే. మానవ జీవితం విషయంలో ఆయన మార్గదర్శకం చూపించని విషయమంటూ ఏదీ లేదంటే అతిశయోక్తి కాదు. **అందుకే ఆయన ఈ యుగానికే పరమగురువు.** ఆయన జీవితము, బోధ, ఆచరణలే ఆయన విశ్వరూపం. అది అంతా ఒక్కటే అయిన ఆయన రూపం.

## Statement about ownership and other particulars of SAI BABA (Monthly) FORM - IV (See Rules 8)

| | |
|---|---|
| 1. Name of the Publication | : SAIBABA |
| 2. Periodicity of its publication | : MONTHLY |
| 3. Printer's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Sri Manga Bharadwaja Trust,<br>Bhakta Nivas, 12-1-170/46P,<br>Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad -68 |
| 4. Publisher's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Sri Manga Bharadwaja Trust,<br>Bhakta Nivas, 12-1-170/46P,<br>Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad -68bb |
| 5. Editor's Name | : P.Srinivasa Rao |
| Nationality | : Indian |
| Address | : Sri Manga Bharadwaja Trust,<br>Bhakta Nivas, 12-1-170/46P,<br>Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68 |
| 6. Name and Address of individuals who own the News papers and Shareholders holding more than 1% of the total capital | : Advisory Member of Sri Manga Bharadwaja Trust |

I, P.Srinivasa Rao, hereby declare that the particulars given above are true the best of my knowledge and belief.

Ongole
1-10-2010

(Sd.)P.Srinivasa Rao
Signature of Publisher

# తరింపచేయాలన్నదే వారిద్దరి తపన

శ్రీమతి సరోజిని జాలారావు

శ్రీ ఆదిశంకరాచార్య స్థాపించిన సన్యాసాశ్రమ ధర్మం దాదాపు లుప్తమయ్యే సమయంలో శ్రీపాద శ్రీవల్లభులు అవతరించి మరల సన్యాస ఆశ్రమ ధర్మాన్ని నెలకొల్పారని ఆ తరువాత కాలంలో హిందూ, ముస్లిముల కలహాలతో సతమతమవుతున్న సమయంలో శ్రీ నృసింహ సరస్వతి అవతరించి కొందరు ముస్లిము రాజులను కూడా చేరదీసి, ఆ తరువాత అవతారంలో మాణిక్యప్రభు ముస్లిములను, హిందువులను, సిక్కులను కూడా ఆదరించారని, అక్కల్‌కోట స్వామి, సాయిబాబాల కాలం వచ్చేసరికి ఏ మతం మీద ఎవరికీ విశ్వాసం లేకుండా పోయినదని, అలాంటి సమయంలో సాయిబాబా సర్వమత సామరస్యత కొరకు అవతరించారని పూజ్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారు చెప్పారు. అలాంటి సాయినాధుడి తత్వాన్ని ఆంధ్రరాష్ట్రమంతటా అంతకుముందు ఎవరూ చెప్పలేనంతగా ప్రచారం చేసి మహాత్ముల చేత మన్ననలు పొంది లెక్కలేనన్ని ఆధ్యాత్మిక గ్రంధాలు పామరులకు గూడా అర్థమయ్యేరీతిలో వ్రాసిన ఈ మహానుభావుడు ఎవరయివుంటారు అని ఆలోచిస్తే నాకు తట్టినది ఏమిటంటే ఎంతో ఉన్నతమైన మానవతా ధర్మాలను ఏది ఆచరిస్తే మానవుడు మాధవుడుగా మారగలడో, ఏదైతే ఋషులు వేదాలలో, శ్రుతులలో, భగవద్గీతలో చెప్పివున్నదో దానిని అతి సులభంగా పామరులకు గూడా అర్థమయ్యే రీతిన అనుభవపూర్వకంగా తెలిపిన సాయినాధుడి తత్వాన్ని గూడా అర్థం చేసుకోలేక పతనమవుతున్న ఈ మానవాళి మీద దయతో ఆ దత్తాత్రేయుడే, **ఆ ఆదిగురువే మరలా మాస్టరు గారి రూపంలో వచ్చి మనకు బోధించారనిపిస్తుంది.** మన అదృష్టం ఏమిటంటే ఆయన ఆంధ్రులు కావడము, వారు గృహస్థుగా వుండి మనకందరికీ అందుబాటులో వుండడము. తన 16వయేట తమ అన్నగారి కుమారుడి మరణంతో ప్రారంభమయిన వారి సత్యాన్వేషణ 1963 సం॥లో మొట్టమొదటి సాయినాధుని సమాధి విగ్రహ దర్శనంతో నిర్గుణ సమాధి స్థితిని పొంది యింకా యింకా తీవ్రమై తన శరీరాన్ని మనసును సన్యాసం స్వీకరించడానికి సిద్ధం చేసుకుంటూ, సాధన కొనసాగిస్తూ వారి నాన్నగారి కోరికతో (తను ఉన్నంతకాలం సన్యసించకుండా ఉండేటట్లు) వాయిదా వేసుకున్న సమయంలో మన పూర్వపుణ్యం బాగుండి మహాత్ములు చీరాల స్వామి, పాకలపాటి గురువుగార్ల సూచన మేరకు శిరిడీలో సాయినాధుని సందేశం పొంది మాతృశ్రీ అలివేలుమంగతాయారుగారిని కళ్యాణం చేసుకోవడం జరిగింది. ఆ కళ్యాణం ద్వారా గురువుగారు మనకు దక్కారు. **ఆ సాయినాధుడే మనకోసం మాస్టరుగారి రూపంలో వచ్చి తన తత్వాన్ని తనే అందరికీ తెలుపుకున్నారు. లేకపోతే సాయి చరిత్రలోని లీలలకు, వారి చర్యలకు, సూక్తులకు నిగూఢమైన కధలకు ఉన్న ఆధ్యాత్మికపరమైన అర్థం మనకెలా గోచరిస్తుంది?** ఆ కళ్యాణం జరిగివుండకపోతే వారు ఏ అవధూతస్థితిలోనో మనకందుబాటులో వుండకుండా వుండేవారు. అమ్మగారు పతనమవుతున్న బిడ్డల మీద తల్లికుండే ప్రేమతో వారిని మూడుముళ్ళ బంధంతో బంధించి మన ముందు వుంచేశారు.

ఇక అమ్మగారు గూడా వారికి తగ్గ యిల్లాలిగా వుంటూ వారు చేసే సాయి ప్రచారానికి అన్ని విధాలా తోడ్పడుతూ మనందరికీ గురువుగారిని అందుబాటులో వుండేటట్లుగా చేసిన మహాసాధ్వి. అమ్మగారు 7 సం॥లు జిల్లెళ్ళమూడి అమ్మ ఆశ్రమంలో వుండి ఆమె సేవచేసుకున్న మహా సాధకురాలు. పాకలపాటి గురువుగారు, సాయినాధుడు అమ్మగారినే మాస్టరుగారి ధర్మపత్నిగా నిర్ణయించారంటే అమ్మగారి గొప్పతనం గురించి వేరే చెప్పనక్కర్లేదనుకుంటాను. **అమ్మగారి ఓరిమి వల్లే మనకోసం గురువుగారు తన జీవితాన్ని అంకితం చేయగలిగారు. మనందర్నీ తరింపచేయాలన్నదే వారిద్దరి తపన.** అందుకే సుధీంద్రబాబుగారు అమ్మగారిని మాస్టరుగారిని చూసి "వెంకటేశ్వరస్వామి, అలివేలుమంగమ్మా వచ్చారే!" అని అన్నారు. ఒక గంట కూడా మన భర్తలు యితరులకోసం గడపడం మనం యిష్టపడం. 24గం॥లు యితరుల శ్రేయస్సుకోసమే పాటుపడే మాస్టరుగారిని ఎంతో ఓరిమితో, ఆ సేవ చేసుకోనిచ్చారు అమ్మగారు. అది దేవతలకే సాధ్యపడుతుంది కాని మానవమాత్రులకు కాదు. యిలా గురువుగారు మనం సుఖశాంతులతో జీవించే మార్గాన్ని చెప్పవలసినవన్నీ చెప్పేసి తను ఆచరించి చూపించి,

యింకా పుస్తకాల రూపంలో కూడా వ్రాసేసి యిక దానిని సద్వినియోగం చేసుకోవలసిన బాధ్యతను మనకు వదిలేసి తను సాయినాధుడిలో లీనమైపోయారు. బాబా 'గురువును తెలుసుకోవాలి లేకపోతే ఎందుకొచ్చినట్లు? పిడకలు ఏరుకోవాడానికా?" అన్నట్లు మనకు సద్గురువు దొరికారు. యిక వారు చెప్పినదాన్ని వినియోగించుకోవడం, వినియోగించలేకపోవడం మన చేతుల్లోనే వున్నది.

**అమ్మగారి సన్నిది కూడా మాస్టరుగారి సన్నిధిలాగే చాలా ప్రశాంతంగా వుంటుంది. ఆ ఇల్లు ఒక దేవాలయం.** ప్రత్యక్షంగా అమ్మగారు, పరోక్షంగా అయ్యగారు కొలువున్న దైవాలు. యిక మన కర్తవ్యం ఏమిటంటే గురుపత్నిని, గురుపుత్రుడు ద్వారకబాబుగారిని, పుత్రిక వేదమ్మగారిని గురువుగారితో సమానంగా చూసుకోవడము. అదే గదా గురుగీత చెప్పింది కూడా!

అంతటి పరమగురువుగారు, సాటిలేని గురువుగారు మనకి దొరికినందుకు మనం ఎలా వాళ్ళకు కృతజ్ఞత తెలుపుకోవాలి. అందులో, వాళ్ళు మనలను ఏమి చెయ్యమని చెప్పారో అది ఆచరించడానికి మన శాయశక్తుల ప్రయత్నం చెయ్యడం ప్రధానమైనది. మన గురువుగారు ఏం చెప్పారో కొన్ని ఇక్కడ వారి మాటలలోనే చెప్పుకుందాం 1) సాధన అంటే సంస్కారములను మార్చుకొనే కృషి. సంస్కారాల మార్పే మార్గము. దైవ సాన్నిధ్యమే పరమ ధ్యేయము. పూజాది సర్వ సేవలూ అందుకు ఉపకరణాలు మాత్రమే. 2) ఫలప్రదంగా పని చెయ్యడమొక్కటి మాత్రమే ధ్యేయం కాదు. పని చేసేటప్పుడు కల్గే అడ్డంకులకు మన మనస్సు ఏ విధంగా రియాక్టు అవుతుంది అనే అంశాన్ని అనుక్షణం గుర్తించడం ముఖ్యము. ఆ సమయంలో ఎదుట వారిలో సాయిని మర్చిపోకుండా అనుక్షణం గుర్తుంచుకోవడం అనే నిరంతర క్రియను సహజసిద్ధం చేసుకోవటమే నిరంతర సాధన కావాలి. 3) పని విఫలమయ్యేందుకు విఘ్నాలు కలిగించిన ఎదుట వ్యక్తే కారణమని భావించటమే సత్యమైతే, శ్రీ సాయినాధుని సర్వ సమర్థత్వాన్ని అనుమానించవలసివస్తుంది. 4) ఇన్ని సంవత్సరాలుగా సాధన చేసినా శాంతి లభించలేదని ఒక సాధకుడు గురువు దగ్గర వాపోతాడు "నీకు గర్భశత్రువులుండే చోట మూడు సంవత్సరాలు నివసించు'' మని ఆ గురువు వానిని ఆజ్ఞాపిస్తారు. అతడలా చేశాక అతనికి శాంతి అనుభవం అయ్యింది.

కారణం:- శత్రువుల యొక్క అభాండాలు, దూషణ ద్వారా మన పాపం వారికిపోయి వారి పుణ్యం మనకొస్తుంది. అదే సమయంలో మనలోని బలహీనతలు బయటపడి వాటిని నిర్మూలించుకొనే ప్రయత్నం చేస్తాము. అలాగాక మనలను పొగిడేవారే మన చుట్టూ చేరితే ఇక మనలోని బలహీనతలు మనకు తెలిసొచ్చేదెలా? మనలో సంస్కారరూపంలో వుండే బలహీనతను మనం గుర్తించి

**మన గురువుగారు ఎప్పటికీ నిత్యసత్యులే. ఎంతోమందికి ప్రత్యక్షంగాను, స్వప్నంలోనూ దర్శనమిస్తూ ముందుకు నడిపిస్తున్నారు.**

వివేక విచారాలతో దానిని నిర్మూలించే మానసిక యుద్ధం, పరితాపము లేకుంటే దుష్టసంస్కారాలు నశించవు. ఒక విధంగా చూస్తే మన శత్రువులే మనకు టచ్‌స్టోన్ (పరుపురాళ్ళు)గా ఉపయోగపడి సహాయం చేస్తున్నారన్నమాట. అందుకే సాయినాధుడు ఎవరినీ నీ శత్రువులుగా భావించవద్దు అని చెప్పారు. 5) **ఫ్యామిలీ లైఫ్ మనలోని బలహీనతలను బయట పెట్టి వాటిని నిర్మూలించుకునే వర్క్‌షాపుగా మన సాధనకొరకు భగవంతుడు మనకనుగ్రహించిన వరముగా భావించాలి.** 6) టేపురికార్డువలె వల్లించే అష్టోత్తరం సహస్రనామస్తోత్రలతో మాత్రమే భగవంతుడు సంతోషిస్తాడని భావించేటట్లయితే అది శుద్ధ తప్పు. అప్పుడు క్షుద్ర రాజకీయ నాయకులకు భగవంతునికి బేధమేముంది! **అసలు అర్థం చూస్తే అన్ని నామాలూ ఒక్కటే. అంటే అంతటా నిండిన సర్వజ్ఞత్వము సమర్థత్వముగల్గి నిత్యానందమైన శక్తి ఒక్కటే శాశ్వతంగా ఉన్నది.**

మన గురువుగారు ఎప్పటికీ నిత్యసత్యులే. ఎంతోమందికి ప్రత్యక్షంగాను, స్వప్నంలోనూ దర్శనమిస్తూ ముందుకు నడిపిస్తున్నారు. వారు యీ జన్మలోనే కాక రాబోయే అన్ని జన్మలలోనూ మనకు తోడుండాలని గురువుగారిని, అమ్మగారిని ప్రార్థిస్తున్నాను.

మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.

# లక్ష్యము–మార్గము–గమ్యము

దివ్యజనని అలివేలు మంగమ్మ

ఒకరోజు సాయంత్రం. పూజ్యశ్రీ మాస్టరుగారి సన్నిధిలో చాలామంది కూర్చుని వున్నారు. కొందరు ప్రశ్నలు వేస్తున్నారు. సందేహాలు వ్యక్తపరుస్తున్నారు. పూజ్యశ్రీ మాస్టరుగారు ఎంతో ఉత్సాహంగా సమాధానాలు యిస్తున్నారు. ఆ మాటల సందర్భంలో పూజ్యశ్రీ మాస్టరుగారు యిలా చెప్పారు :

"ఎవరికైనా ఏ పని చేయాడానికైనా స్పష్టమైన అవగాహన వుండాలి. అసలు తమ గమ్యమేమిటో స్పష్టంగా వుండాలి. అందుకు చేరవలసిన మార్గం తెలుసుకోవాలి. దానిపట్ల లక్ష్యం దృఢంగా వుండాలి–ఈ మూడు దృఢంగా లేనిదే ఏదీ సాధించలేరు. జీవితంలో ఏమి సాధించదలచామన్నది ముఖ్యమైన విషయం. అందుకు ముందు మనకేం కావాలో స్పష్టంగా తెలియాలి. ఉదాహరణకు: శిరిడీ వెళ్ళాలనే లక్ష్యం పెట్టుకుంటాము. అక్కడకు వెళ్ళే మార్గము తెలుసుకుంటాము. చివరకు అక్కడకు అంటే గమ్యానికి చేరుతాము. అలాగే చదువు–ఉద్యోగము, మరొకటి, మరొకటి–యిలా...

ఇంతలో అక్కడ కూర్చున్నవారిలో ఒకరు అందుకుని, "మాస్టరు గారూ! మీరు చెబుతున్న విషయాలు విన్న మీదట, మీ పుస్తకాలు చదువుతున్నాము గనుక మాకు గమ్యమేమిటో తెలిసింది. అందుకువలసిన మార్గాలు గూడ మీరు ఎప్పుడూ బోధిస్తూనే వున్నారు. లక్ష్యమెలా వుండాలో గూడ అర్థమవుతూనే వున్నది. కానీ ప్రపంచంలో మా వంటి సంసారులము, సామాన్య మానవులము–ఎన్నో సంస్కారాలు గల సాటి మనుషులతో వ్యవహరించవలసి వస్తుంది. ఇవి గాక కుటుంబంతో, బంధువులతో–ఎలా మసలుకుంటూ ఈ మార్గాన నడవాలో అన్నది కొరుకుడు పడడం లేదు. ఈ లక్ష్యమున్న వాళ్ళు నిరంతరం బాబా ధ్యాస ఎలా నిలుపుకోవాలో, దానిని ఎలా సాధించాలో అర్థంగావడం లేదు" అన్నాడు.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారిలా సమాధానమిచ్చారు:

"అవును నిజమే! నువ్వు చెప్పినట్లు మొదట్లో చాలా కష్టంగానే వుంటుంది. కానీ నిజంగా ఆచరించాలని ప్రయత్నం గట్టిగా చేస్తే రానురానూ సులభమవుతుంది. మరి అలాగాకపోతే ఈ సాధించేవారందరూ ఎలా సాధించగలుగుతున్నారు?" అంటూ యింకా యిలా చెప్పారు:

"అసలు దేనినైనా సాధించాలంటే దానికి కావలసిన అర్హతలేమిటో తెలుసుకోవాలి. దానికి ఏం చేయాలో తెలుసుకోవాలి. ఉదాహరణకు ఒక ఇంజినీరో, డాక్టరో కావాలంటే దానికి కావలసిన కోర్సులు చదవాలి. చదవడానికి తగిన ప్రయత్నం చేయాలి. ఉదాహరణకు డాక్టరులా కావాలంటే దానికి కావలసిన పుస్తకాలు చదవాలి. ఊరికే పుస్తకాలు పట్టుకుని దానికి వున్న ప్రతికూల పరిస్థితుల గూర్చి ఆలోచిస్తుంటే డాక్టరు ఎలా అవుతాడు? ఇంట్లోని పరిస్థితులుగాని, కాలేజీలో పరిస్థితులు గాని, బయట పరిస్థితులుగానీ, ఎట్లా వున్నా తన చదువు పూర్తి చేయాలి. అప్పుడే డాక్టరు అవుతాడు. అట్లానే ఆధ్యాత్మికత సాధించాలంటే దానికి ఏవేవి కావాలో వాటిని మనలో సమకూర్చుకోవాలి. అన్ని పరిస్థితులూ అనుకూలంగా వుంటేనే నేను బాబాను గుర్తుపెట్టుకోగలను అనడం, అలలు లేకుండా వున్నప్పుడు సముద్రంలో స్నానం చేస్తానని అన్నట్లుంటుంది. అందుకని పరిస్థితులను సాధనకు అనుకూలంగా మార్చుకునే ప్రయత్నం చేయాలి. అసలు పరిస్థితులు అనుకూలించడమంటూ సాధారణంగా జరుగదు. ఎట్టి పరిస్థితిలోనైనా మనం అనుకున్నది సాధించవలసిందే! లేకుంటే మనం ఎప్పటికీ యిలానే వుంటాము. అందుకని అనుకూలత, ప్రతికూలత–పరిస్థితులలో వుండవు. మనలోనే వుంటాయి. ఒకే పరిస్థితులలో ఒకడు ఒకరకంగా ప్రతి స్పందిస్తే మరొకరు మరొకరకంగా ప్రతిస్పందిస్తారు.

అందుకని ముందుగా మనలో వున్న బలహీనతలను, లేదా గుణాలను గమనించాలి. ఏవి ఎందుకు ఆటంకమవుతున్నాయో తెలుసుకోవాలి. అప్పుడు వాటిని ఎలా అధిగమించాలో ఆలోచించాలి. అట్టి ప్రయత్నం చేయాలి. కానీ

**ఏ పని చేయాడనికైనా స్పష్టమైన అవగాహన వుండాలి. అసలు తమ గమ్యమేమిటో స్పష్టంగా వుండాలి. అందుకు చేరవలసిన మార్గం తెలుసుకోవాలి. దానిపట్ల లక్ష్యం దృఢంగా వుండాలి-ఈ మూడు దృఢంగా లేనిదే ఏదీ సాధించలేరు.**

**అనుకూలత, ప్రతికూలత-పరిస్థితులలో వుండవు. మనలోనే వుంటాయి.**

**మన స్వభావమే ఆటంకాలకు కారణమని తెలుసుకోవాలి.** కొంచెం ఆలోచిస్తే ఇది ఎవరికైనా తెలుస్తుంది. **ఇది తెలుసుకోలేక మన చుట్టూ వున్న పరిస్థితులూ, వ్యక్తులూ కారణమని అనుకుంటాము.** కారణం ఇది బాహ్యమైన విషయాలకు సంబంధించినది కాదు. పూర్తిగా యిది మానసికమైన విషయము. అందుకని దానికి అడ్డుపడే పరిస్థితులంటూ ఏవీ వుండవు.

ఉదాహరణకు ఒకనికి ఎంతో చదువుకోవాలని వుందనుకుందాం. వాడు స్కూలులో చేరగలిగితే పుస్తకాలు లేకపోయినా, ఇంట్లో కరెంటు లేక పోయినా మరొకరి పుస్తకాలు తీసుకునో, వీధి దీపాల దగ్గరో ఏదో ఒక విధంగా చదువుకుంటాడు. కానీ వాడు స్కూలుకే వెళ్ళలేని పరిస్థితిలో వున్నప్పుడు అతడెలా చదువు కొనసాగించగలడు? కారణం వాడు చదువుకోవడం చదువుకోకపోవడమన్నది పూర్వకర్మననుసరించి వుంటుంది గనుక పరిస్థితులు అనుకూలించడమూ, అనుకూలించకపోవడమూ వుంటుంది. కానీ అదే భగవంతుని ఆరాధించే విషయంలో ఎటువంటి అడ్డంకులూ వుండవు–మన మనస్సు తప్ప. మన సంస్కారాన్ని బట్టీ మన మనస్సు నిరంతరం ఎన్నో ఆలోచనలను చేస్తూంటుంది. వాటిని తప్పించి సాధనపై మనస్సుకు పెట్టడానికి చేసే ప్రయత్నమే సాధన. ఏ పని చేస్తున్నా చేయకపోయినా మనస్సు దాని దోవన అది ఆలోచిస్తూనే వుంటుంది. ఆ ఆలోచనలకు బదులు మనం చెయ్యాలనుకున్న ఆలోచనలను చేయడానికి ప్రయత్నించాలి. అప్పుడు

భగవంతుని ఆరాధించే విషయంలో ఎటువంటి అడ్డంకులూ వుండవు-మన మనస్సు తప్ప.

ఏ పని చేస్తున్నా దాని పని అది కొనసాగిస్తూ వుంటుంది."

అందుకు అతడు అందుకుని,"అదెలా సాధ్యం మాస్టారు? ఇతరులతో మాట్లాడుతున్నపుడు బాబాను ధ్యానించడమెలా?" అని అడిగాడు.

అందుకు పూజ్యశ్రీ మాస్టరుగారు అన్నారు: "ఏమి? ఎందుక సాధ్యం కాదు? మనం అనుకోవాలే గానీ సాధ్యంగానిదంటూ ఏమీ లేదు. మరి అలా చేసిన వాళ్ళేగదా గొప్ప భక్తులైనారు!

ఉదాహరణకు మన యింట్లో ఎంతో ఆప్తులైనవారు దూరమైపోయారు. కొంతకాలంపాటు మనమేం చేస్తున్నా, ఎవరితో ఏమి మాట్లాడుతున్నా ఆ ఆలోచనలే మెదులుతుంటాయి. లేకపోతే మనలను ఎవరన్నా బాధపెడుతున్నాడనుకుందాము. మనం ఏది చేస్తున్నా అదే మనస్సులో మెదులుతుంటుంది. అలాగే ఒక యువకుడు ఒక అమ్మాయిని ప్రేమించాడనుకుందాం. అతడు ఏమి చేస్తున్నా ఆ పిల్లమీదే మనస్సు లగ్నమై వుంటుంది. ఆ అమ్మాయి గురించిన ఆలోచనలే కొనసాగుతుంటాయి. అలాగే మనం ఏం చేస్తున్నా బాబా మీద మనస్సు లగ్నమై వుంటుంది. అది మన కోరిక ఎంత దృఢంగా వున్నది అన్నదాని మీద ఆధారపడివుంటుంది. డబ్బు సంపాదించాలన్న కోరిక దృఢంగా వున్నవాడు అదే ఆలోచనలు చేస్తూ అందుకు కావలసిన ప్రయత్నాలు చేస్తుంటాడు. అలాగే దేని

మనం అనుకోవాలే గానీ సాధ్యంగానిదంటూ ఏమీ లేదు.

మీదనైనాసరే కావాలని బాగా కోరిక కలవాడు దానికోసం నిరంతరం ప్రయత్నిస్తుంటాడు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అలాగే సాధన గూర్చి మన కోరిక బాగా వున్నపుడు అందుకు ఎప్పుడూ ప్రయత్నిస్తూనే వుంటాము. దానికి ఏవీ అడ్డురావు."

అతడు : నాకేమీ అర్థంకావడం లేదు మాస్టారూ! కొన్ని పరిస్థితులలో అంటే ఎవరైనా మనతో తగవులాడితే, లేదా అనవసరంగా మనలను ఎవరైనా అనరాని మాటలు అంటూ వుంటే వాళ్ళల్లో బాబాను చూడడమెలా మాస్టారూ!"

మాస్టరుగారు : "**బాబాను చూడడమంటే వారికి నమస్కరించమని కాదు, వాళ్ళ పాదాలమీద పడమనీ కాదు. వాళ్ళతో ఎలా వ్యవహరించాలో అలా వ్యవహరిస్తూ వారిలోగూడ బాబా వున్నారనే విషయాన్ని గుర్తుపెట్టుకుంటూ వుండాలి.** పిల్లిలో, కుక్కలో గూడ బాబా తాము వున్నామని అన్నారు గదా! అంటే వాటిలో వున్నారని తలచి వాటిని కొట్టవద్దని, అసహ్యించుకోవద్దనీ అర్థం. అంతేగాని అవి వంటింట్లోకి వస్తే బయటకు పంపవద్దని కాదు. మనతో పాటు దానిని కూడ కూర్చోబెట్టుకుని మన విస్తట్లో దానికి గూడ తినిపించమనీ గాదు. ఎవరితో ఎలా వుండాలో అలా వుండాల్సిందే. కానీ ఎవరిపైనా ద్వేషము, కోపము, అసూయ మొదలైన భావాలు పెట్టుకోకుండా వుండాలి. **మనం అందరిలో బాబా వున్నారన్న భావాన్ని నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తుంటే మనలోని అవగుణాలు పోయే అవకాశముంది.** మనం అలా చేస్తుంటే ఒక్కొక్కప్పుడు అవతలి వాళ్ళల్లో గూడ మార్పు వచ్చే అవకాశముంది. ఉదాహరణకు నువ్వు చెప్పినట్లు అవతలి వాడు మనలను చాలా యిబ్బంది

పడుతున్నాడు. చాలా అనవసరంగా అనరాని మాటలు అంటున్నాడనుకుందాం. అతనిలోగూడ బాబా వున్నారని భావన చేస్తున్నప్పుడు బాబాయే ఎందుకో ఇలా అనిపిస్తున్నాడు. ఇది మనకు మంచిది కాబట్టే చేస్తున్నాడు అనిపిస్తుంది. లేకపోతే మన చెడ్డకర్మను ఈ విధంగా తొలగింపజేస్తున్నాడు అనుకుంటాము. అలా అనుకున్నప్పుడు మనమూ ఆవేశపడకుండా మాట్లాడగలుగుతాము. అలా చేస్తుంటే ఒక్కొక్కసారి అవతలి వాళ్ళలో గూడ మంచి మార్పు రావచ్చు. అంతేగాక వాళ్ళను గూడ సరైన మార్గంలో నడిపించమని, సరియైన విధంగా మార్పు తెమ్మనీ బాబాను ప్రార్థించవచ్చు".

అతడు: "ఒక్కొక్కసారి ఈ బాదరబందీ అంతా ఎందుకు? ఇంట్లోనుంచి ఎక్కడికైనా వెళ్ళిపోతే హాయిగా సాధన చేసుకోవచ్చు గదా! అనిపిస్తుంది మాస్టారూ!"

పూజ్యశ్రీ మాస్టరుగారు : "వెళ్ళిపోవచ్చు. కానీ పరిస్థితులనుంచి తప్పుకోవడానికి గాదు. **కావలసినది పొందడానికి వెళ్ళాలి. కానీ అప్పుడు ఎవడూ హాయిగా వెళ్ళడు. విపరీతమైన ఆవేదనతో, తపనతో వైరాగ్యముతో వెళ్తాడు. అంతగా తీవ్రమైన కోరిక వున్నప్పుడు ఇంట్లో విషయాలు అనవసరమైనవి పట్టకుండా పోతాయి. ఎంతవరకూ అవసరమో అంతవరకే పట్టించుకుంటాడు. తర్వాత తనకు తెలియకుండానే అన్నీ విడిచి వెళ్ళిపోవడం జరుగుతుంది. అంటే వెళ్ళకుండా వుండలేడన్నమాట. వెళ్ళిపోతే బాగుంటుంది అని అనుకున్నంతకాలం వెళ్ళిపోవడానికి పరిపక్వత రానట్లే లెక్క. పూర్తి విరాగియైనవాడు ఇల్లూ వాకిలీ పట్టకుండా వెళ్ళిపోతాడు. సాధన కొనసాగిస్తాడు. అలాగాక పరిస్థితులనుంచి తప్పించుకునేందుకు ఎక్కడకు వెళ్ళినా అక్కడి పరిస్థితులు యిలానే చుట్టుకుంటాయి.** ఉదాహరణకు సంసార బాధ్యతలనుండి తప్పించుకుందామని ఒకడు ఏ ఆశ్రమానికో వెళ్ళాడని అనుకుందాము. ఆశ్రమాలలో గూడ మనలాంటి మనుష్యులే వుంటారు గనుక వాళ్ళతోనూ సమస్యలు వస్తాయి. అలాగాక ఏ అడవిలోకో వెళ్ళాడని అనుకుందాము. అక్కడ అన్నింటికీ యిబ్బందే! అంతేగాక ఎప్పుడే క్రూర జంతువు వచ్చి మీద పడుతుందోనని భయము. వీటన్నింటికీ భయపడి అక్కడికంటే ఇల్లే బాగుందని ఇంటికి తిరిగి వస్తాడు. అలాగాక ఏదో ఒక ఊరిలో పాడుబడ్డ గుడిలోనో లేక ఊరిబయట ఏ చెట్టు క్రిందనో ముక్కుమూసుకుని కూర్చున్నాడనుకుందాం. అప్పుడు ఎవరో గొప్పస్వామి వచ్చాడనే భావంతో మెల్లగా జనం చుట్టూ జేరడం ప్రారంభిస్తారు. తమ కోరికలు కష్టాలు తీర్చమని అడగడం ప్రారంభిస్తారు. చెప్పకుండా వుంటే ఒక రకమైన గోల, చెప్పడం ప్రారంభిస్తే మరొకరకమైన గోల మొదలవుతుంది. అదే బాగుందనుకున్నవాడు, అంటే తన దగ్గరకు జనం జేరడము తనకు స్వామి స్థానము బాగుందనుకున్నవాడు తన దగ్గరకు యింకా యింకా జనం రావాలని తన స్థానం యింకా యింకా పెరగాలనీ భావిస్తాడు. ఆ స్థానం దిగజారకుండా వుండడానికి జనం చేరడానికి, వచ్చిన వారు వెళ్ళిపోకుండా వుండడానికీ పడరాని పాట్లు పడతాడు. అంటే కీర్తికాంక్ష పెరిగి పోతుందన్నమాట. తనను పొగిడేవారంటే యిష్టము, విమర్శించే వారిమీద కోపము, ద్వేషము మొ॥న వన్నీ వచ్చి ప్రతీకారవాంఛ కలిగి–యిలా ఇంట్లో వున్నప్పటికంటే ఎక్కువ ఏర్పడి ఊబిలోకి దిగిపోతాడు. అందుకని ఎటుచూసినా పూర్తిగా విరాగి కాని వాడికి పాట్లు తప్పవు. అందుకని కుటుంబంతో వుంటూనే వచ్చే సమస్యలన్నింటినీ ఎదుర్కొంటూనే సాధన సాగించాలి. సుఖం గాని, దు:ఖం గానీ బాబా ప్రసాదంగా తీసుకోగలగాలి. నిందాస్తుతులను గూడా ఆయనే ప్రసాదించారని భావించాలి.

**అప్పుడు అన్నింటిపట్ల నిర్లిప్తత కలుగుతుంది. బాబా పట్ల భక్తి పెరుగుతుంది. మనలో వున్న ఒక్కొక్క బలహీనత తొలగి పోతుంటుంది.** కారణం బాబా మీద బాగా భక్తి వుంటే ఎవరితోనూ కీచులాటలు వుండవు. కారణం బాబా ఎవరితోనూ కీచులాటలూ, తగవులూ వద్దన్నారన్న విషయం గుర్తొస్తుంది. శరీర సౌఖ్యాలపట్ల ఉదాసీనత పెరుగుతుంది. వైరాగ్యం జనిస్తుంది. బాబాను స్మరించుకున్నకొద్దీ ఆయన చర్యలు, సూక్తులూ, ఎప్పుడూ గుర్తుకు వస్తుంటాయి. కుక్క, నక్కలలోనూ, చీమలు, దోమలలోనూ

సంసార బాధ్యతలనుండి తప్పించుకుందామని ఒకడు ఏ ఆశ్రమానికో వెళ్ళాడని అనుకుందాము. ఆశ్రమాలలో గూడ మనలాంటి మనుష్యులే వుంటారు గనుక వాళ్ళతోనూ సమస్యలు వస్తాయి.

సుఖం గాని, దు:ఖం గానీ బాబా ప్రసాదంగా తీసుకోగలగాలి. నిందాస్తుతులను గూడా ఆయనే ప్రసాదించారని భావించాలి.

నేనే వున్నానని బాబా చెప్పినమాట గుర్తొస్తూంటుంది. అందుకని **మన గమ్యం మీద తపనను పెంచుకోవటం ముఖ్యం.** లక్ష్యాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా సాధన కష్టం కాదు.

అతడు : "అయితే ఈ సాధన చాలా కష్టం మాస్టారు!"

పూజ్యశ్రీ మాస్టరుగారు: ఏదైనా యిష్టముంటే కష్టమనిపించదు. అందుకని సాధన మీద యిష్టం పెంచుకోవాలి. అయినా కష్టపడకుండా ఏది వస్తుందోయ్! చెప్పు! వంట చేయకుండానే భోజనం వస్తుందా? సరే! నువ్వు వంట చేయకుండానే భోజనం వస్తుందనుకుందాం. కానీ ఎవరో ఒకరు చేయాల్సిందే కదా! దానికి మూల్యం నువ్వు చెల్లించుకోవాల్సిందే గదా! పోనీ ఇంట్లో ఆడవాళ్ళే చేస్తారనుకుందాం. దానికి కావలసినవన్నీ సమకూర్చాలి గదా! అంటే దానికోసం నువ్వు డబ్బులు సంపాదించాలి కదా! దానికోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఉద్యోగంలో కష్టపడాలి కదా! ఆలోచించు. దేనిలో కష్టం లేదంటావు? ఎవరినైనా చూడు! కష్టపడకూండా ఏదైనా సాధించగలుగుతున్నారా? చివరకు రాజు రాజ్యభోగాలు అనుభవిస్తున్నాడనీ, సుఖంగా వుంటాడనీ అనుకుంటాము. కానీ దేశం మొత్తం బాధ్యత, ఆ దేశంలోనే ప్రజలందరి కష్టసుఖాలూ చూసే బాధ్యత ఆ రాజుదే కదా! ఇతర రాజులు రాజ్యాన్ని ఆక్రమించకుండా చూసుకోవడం మొ॥న ఎన్ని బాధ్యతలో రాజుకుంటాయి. మరి రాజు రాజ్యభోగాలు కావాలనుకుంటే ఈ బాధ్యతలు, కష్టాలూ, తప్పవు మరి! కనుక ఏ విధంగా ఆలోచించినా కష్టపడకుండా జీవితం నడవదని తెలుస్తుంది".

"ఏ కష్టమొచ్చినా నువ్వు బాబాను మరీ ఎక్కువగా సేవిస్తుండడం వల్లనే ఇవన్నీ వస్తున్నాయంటున్నారు మాస్టారూ!"

> ఏదైనా యిష్టముంటే కష్టమనిపించదు. అందుకని సాధన మీద యిష్టం పెంచుకోవాలి.

"అసలు కష్టాలు, సమస్యలూ లేని వారంటూ ఎవరైనా వున్నారా! నాకే సమస్యలూ లేవు, నేను హాయిగా వున్నాను అని ఎవరినైనా చెప్పమనండి చూద్దాం. ఎవ్వరూ చెప్పలేరు. నిజంగా సమస్యలేవీ లేనివారు గూడ ఏదో సమస్యను సృష్టించుకుని మరీ కష్టాలు పడుతున్నామని చెబుతారు. అయినా బాబాను సేవించనివారంతా సుఖంగా వున్నారా? వాళ్ళకే సమస్యలూ లేవా?

అతడు: "నిజంగా ఇవేవీ లేనివాళ్ళంతా సుఖంగా వున్నట్లనిపిస్తున్నది మాస్టారూ!"

పూజ్యశ్రీ మాస్టరుగారు : "నిజంగా సుఖంగా వుంటే అంతకంటే కావలసినది ఏమున్నది? హాయిగా కాలుమీద కాలు వేసుకుని కూర్చొవచ్చు గదా! 'నేను సుఖంగా వున్నాను' అని గుండె మీద చెయ్యి వేసుకుని చెప్పమనండి చూద్దాం. ఒక్కరు గూడ చెప్పరు, చెప్పలేరు. అసలు ఆధ్యాత్మికత అంటే ఏమిటో అవగాహన లేక,

> లక్ష్యాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. అప్పుడు ఎక్కడ వున్నా, ఏం చేస్తున్నా సాధన కష్టం కాదు.

బాబా అంటే ఏమో, అసలు మహాత్ములు ఎందుకు వస్తారో, ఏమి చేస్తారో తెలియక అలా మాట్లాడుతుంటారు. బాబాను, మహాత్ములను సేవించినందువలన కష్టాలు ఎందుకు వస్తాయి? ఆయనను కొద్దిగా ప్రార్థించినవారికే మేలు జరుగుతుంటే, బాగా సేవించిన వారికి వారు కష్టాలను కలిగిస్తారా? అలా చేసినందువలన వారికేమి లాభము? వారికి మనమంటే ద్వేషమా? సకల జీవులను సమభావంతో ఆదరించేవారు, ప్రేమించేవారూ అయిన మహాత్ములు మనకు కష్టాలను ఎందుకు కలుగజేస్తారు? తల్లిదండ్రులకంటే ప్రేమస్వరూపులు వారు. అందుకే **బాబా అంటారు : నాకెవ్వరిమీదా కోపం రాదు. తల్లికి బిడ్డలమీద ఎప్పుడైనా నిజంగా కోపం వస్తుందా? సముద్రమెన్నడైనా నదులను త్రిప్పి వంపివేస్తుందా!** అందుకని మహాత్ములు అపార కరుణామయులు. నిరంతరం సకల జీవుల శ్రేయస్సు కొరకు పాటుపడుతుంటారు. అలాంటి వారు మనలను కష్టపెట్టడం ఎలా సాధ్యం?"

అతడు: "మరి భక్తులకు కష్టాలు వస్తున్నాయ్ కదా మాస్టారూ! మరి ఆయన రక్షించాలి గదా?

(పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధానం వచ్చే సంచికలో)



# శ్రీ సాయి సచ్చరిత్ర



**మరాఠీ మూలం: శ్రీ హేమాద్పంతు** **సెప్టెంబరు సంచిక తరువాయి**

**స్వేచ్ఛానువాదం: పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ** అధ్యాయం - 51

శ్రీ గణేశాయ నమః, శ్రీ సరస్వత్యై నమః, శ్రీ గురుభ్యోన్నమః,

శ్రీ కులదేవతాయై నమః శ్రీ సీతారామచంద్రాభ్యాం నమః శ్రీ సద్గురు సాయినాథాయ నమః



శ్రీ సాయిబాబా దర్శనానికై దీక్షిత్ ఎంతో ఆతృతతో ఎదురుచూస్తూ వుండగా సర్వాంతర్యామియైన సాయినాధుడు తమ భక్తుని ఆకాంక్షను తెలుసుకొని అతని కోరిక తీర్చడానికి ఆయన గూడ ఎంతో ఆతృతపడ్డారు (52) అహ్మద్‌నగర్‌లో దీక్షిత్ బాబా దర్శనం కలుగలేదని చింతాక్రాంతుడై వున్నాడు. సరిగ్గా అదే సమయంలో శ్యామా అహ్మద్‌నగర్ వచ్చాడు. ఇది అందరికీ ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించింది(53) శ్యామా యొక్క అత్తగారికి ఆరోగ్యం బాగలేదు. అందుకని అతనిని భార్యతో సహా అహ్మద్‌నగర్‌కు వెంటనే రమ్మని శ్యామా మామగారు టెలిగ్రాం యిచ్చారు(54). ఆ తంతి అందగానే బాబా యొక్క అనుమతి తీసుకొని భార్యతో కలసి శ్యామా చితలీ రైల్వే స్టేషన్‌కు వెళ్ళాడు(55). అక్కడ నుంచి మధ్యాహ్నం మూడు గంటలకు వెళ్ళే రైలుబండిలో ఇద్దరూ అహ్మద్‌నగర్‌కు వెళ్ళి టాంగాలో మామగారి యింటి ముందు దిగారు(56) సరిగ్గా ఆ సమయంలోనే అశ్వ ప్రదర్శనకు వచ్చిన నానాసాహెబ్ ఫాన్సే, అప్పాసాహెబ్ గద్రే ఆ దారిన వెళ్తున్నారు(57) టాంగా నుండి శ్యామా దిగడం చూసిన వారిరువురికీ ఎంతో ఆనందమూ, ఆశ్చర్యమూ కలిగాయి(58) అదృష్టవశాత్తూ శిరిడీలోని శ్యామాయే యిక్కడకు వచ్చాడు. 'దీక్షిత్‌ను శిరిడీ తీసుకువెళ్ళడానికి యింతకంటె మంచి తోడు ఏమున్నది?' అనుకున్నారు(59). వాళ్ళు శ్యామాతో యిలా అన్నారు. " మిరికర్ యింట్లో కాకాసాహెబ్ దీక్షిత్ వున్నాడు. వెళ్ళి కలుసుకో. బాబా లీల ఎంత అద్భుతమైనదో! దీక్షిత్ మాకు ఆప్తమిత్రుడు . నువ్వు మిరికర్ యింటికి వస్తే అతనిని మీకు పరిచయం చేస్తాము. అతడు శిరిడీ రావాలని ఎంతో ఆతృతతో వున్నాడు. నిన్ను చూసి ఎంతో ఆనందిస్తాడు" (60,61). ఈ విధంగా శ్యామాకు చెప్పడమేగాక, ఫాన్సే , గద్రేలు శ్యామా సంగతి దీక్షిత్‌కు గూడా తెలియజేశారు. దానితో దీక్షిత్‌కు చింత దూరమై సంతోషం కలిగింది(62).

శ్యామా అత్తగారి ఆరోగ్యం కుదుటబడింది. శ్యామా అక్కడ కాసేపు విశ్రాంతి తీసుకుంటుండగా మిరికర్ నుంచి పిలుపు వచ్చింది(63). ఎండ తీవ్రత తగ్గిన తర్వాత సాయంత్రం శ్యామా బయలుదేరి దీక్షిత్‌ను కలవడానికి మిరికర్ యింటికి వెళ్ళాడు(64) శ్యామా దీక్షిత్‌లు ప్రథమంగా కలవడం అప్పుడే. బాలాసాహెబ్ మిరికర్ వారిద్దరిని ఒకొరికొకరికి పరిచయం చేసాడు. రాత్రికి పదిగంటలకు వెళ్ళే రైలులో వారిద్దరూ శిరిడీ వెళ్ళాలని నిర్ణయించుకున్నారు(65). అప్పుడొక అద్భుతం జరిగింది మిరికర్ అక్కడవున్న బాబా యొక్క చిత్రపటం మీదనున్న తెరను తొలగించాడు (66). అది బాబా భక్తుడైన మేఘునిది. దానిని అతడు శంకరునిగా భావించి భక్తి శ్రద్ధలతో పూజించేవాడు (67) ఆ పటానికి వున్న అద్దం పగిలిపోయిన కారణంగా దానిని బాగుచేయించడానికి శిరిడీ నుండి బాలాసాహెబ్ మిరికర్ దానిని అహ్మద్‌నగర్‌కు తీసుకువచ్చాడు(68). బాగుచేయించాక ఆ ఫోటో దీక్షిత్ కోసమే అన్నట్లుగా మిరికర్ యింట్లోనే వస్త్రంలో కప్పబడివుంది(69) అశ్వప్రదర్శన ముగియడానికి, బాలాసాహెబ్ మిరికర్ శిరిడీ వెళ్ళడానికే యింకా వ్యవధి వుండడం వల్ల ఆ చిత్రపటాన్ని శిరిడీ తీసుకువెళ్ళే పనిని మాధవరావుకు అప్పగించాడు(70) మిరికర్ బాబా ఫోటోపైన వున్న తెరను తొలగించి, మాధవరావుకు

యిచ్చి, " బాబాను వెంటబెట్టుకుని సుఖంగా శిరిడి వెళ్ళండి" అని చెప్పాడు(71). చిత్రపటంలోని సర్వాంగ సుందరమైన సాయినాధుని పైన దృష్టిపడగానే దీక్షిత్ యొక్క హృదయం ఆనందంలో ఉప్పొంగిపోయింది(72). అనుకోకుండా జరిగిన ఈ అద్భుత సంఘటనకు, సుందరమైన, పరమపవిత్రమైన సాయిని చిత్రపటంలో చూసిన దీక్షిత్ నేత్రాలు ఆశ్చర్యంలో ఆనందంలో అలాగే చూస్తుండిపోయాయి(73). శ్రీ సాయిబాబాను దర్శించాలన్న కోరిక అతనికి కలగడము, మార్గమధ్యంలోనే చిత్రపటం రూపంలో బాబా దర్శనమివ్వడము దీక్షిత్‌కు ఎంతో అద్భుతమనిపించింది(74). ఆ చిత్రపటం శిరిడీ నుంచి మిరికర్ యింటికి రావడము, అదే సమయంలో దీక్షిత్ అక్కడకు రావడము ఎంత విచిత్రం?! దీక్షిత్ మనసులోని ఆవేదనను కోరికను తీర్చడానికి సాయి సమర్ధులు మిరికర్ యింటికి ఆ మిషతో వచ్చినట్లు అనిపించింది(76) 'లోనావాల'లో నానాను దీక్షిత్ కలుసుకోవడము, అక్కడ నానా బాబా గురించి మాట్లాడడము, దీక్షిత్ అప్పటికప్పుడే బాబా పట్ల ఆకర్షితుడవడము ఆ విధంగా బాబా దర్శనానికి అంకురార్పణ జరిగింది(77). లేకపోతే ఆ బాబా పటం అప్పుడే అక్కడికెందుకు రావాలి? అంతకాలం అక్కడే ఎందుకుండాలి? దీక్షిత్ ఎదుటే అప్పుడే ఆ వస్త్రాన్ని మిరికర్ ఎందుకు తొలగించాలి? అంతా బాబా లీల కాక మరేమున్నది?(78)

అనుకున్న విధంగానే ఆ రోజు రాత్రి బాబా చిత్రపటాన్ని వెంటబెట్టుకుని దీక్షిత్, శ్యామాలు శిరిడీకి బయలుదేరారు(79). వారిరువురూ రైల్వేస్టేషనుకు చేరుకుని రెండవ తరగతి టిక్కెట్లు కొనుక్కున్నారు(80). పదిగంటలకు రైలు రాగానే రెండవ తరగతి పెట్టెలో ఎక్కడానికి వెళ్ళారు. కానీ ఆ పెట్టె జనంతో కిక్కిరిసి వుండడం కనిపించింది (81). రైలు కదలడానికి కొద్ది వ్యవధి మాత్రమే వుంది. మరొక ఏర్పాటు చేసుకోవడానికి సమయం చాలదు. ఆ పరిస్థితిలో వారిద్దరికీ ఏం చేయాలో తెలియలేదు(82) చివరకు వెనుకకు తిరిగి వెళ్ళాలని,మర్నాడు శిరిడీ వెళ్ళాలని నిర్ణయించుకున్నారు (83). ఇంతలో అనుకోకుండా దీక్షిత్‌కు పరిచయమున్న గార్డు కనిపించాడు. వీరిరువురికి మొదటి తరగతి పెట్టెలో సుఖంగా కూర్చునే ఏర్పాటు చేసాడు. (84) రైలులో కూర్చున్న తర్వాత శ్యామా బాబా గురించి చెప్పసాగాడు దీక్షిత్ హృదయం ఎంతో ఆనందంతో నిండిపోయింది(85). ఈ విధంగా వారి ప్రయాణం ఎంతో సుఖంగా సంతోషంగా గడిచింది. రైలు కోపర్గావ్ చేరగానే యిద్దరూ బండి దిగారు(86). అక్కడ అనుకోకుండ నానాసాహెబ్ చందోర్కర్ కలిసాడు. అతనిని చూడగానే దీక్షిత్ ఎంతో సంతోషించాడు(87). నానా చందోర్కర్ గూడ బాబా దర్శనానికై శిరిడీ బయలుదేరాడు. అనుకోని ఈ సంఘటనకు ముగ్గురూ ఎంతో ఆశ్చర్యపోయారు (88). తర్వాత వారు టాంగా కట్టించుకుని బాబా విషయాలు ముచ్చటించుకుంటూ దారిలో గోదావరిలో స్నానం చేసి శిరిడీ చేరారు(89). ద్వారకామాయిలో ప్రవేశించి బాబాను దర్శించారు. సాయిబాబాను ప్రధమంగా దర్శించిన దీక్షిత్ హృదయం ద్రవించింది. కన్నులు ఆనందభాష్పాలతో నిండిపోయాయి(90). అప్పుడు బాబా స్పష్టంగా దీక్షిత్‌నుద్దేశించి యిలా చెప్పారు: "నేను గూడా నీకోసమే ఎదురుచూస్తున్నాను నిన్ను కలుసుకోడానికే శ్యామాను అహ్మద్‌నగర్ పంపించాను(91)". బాబా అమృత వాక్కులు విన్న దీక్షిత్‌కు శరీరం రోమాంచితమైంది. కంఠం గద్గదమైంది. శరీరమంతా చెమటలు పట్టాయి మనస్సు ఆనందంతో నిండిపోయింది(92). అతని శరీరం కంపించసాగింది నేత్రాలు ఆనందంతో నిండి అర్ధనిమీలితాలయ్యాయి (93) అపరిమిత ఆనందంలో అతడు, "ఈ రోజు నా కన్నులు ధన్యమయ్యాయి" అంటూ సాయి చరణాలను ఆలింగనం చేసుకున్నాడు, అతని ఆనందం అవధులు దాటింది(94). సాయిబాబా పట్ల అతనికి అపరిమిత విశ్వాసం కలిగింది. అతడు బాబా సేవకు తనను తాను అర్పణ చేసుకున్నాడు. అతడు సాయి కృపకు పాత్రుడయ్యాడు(95). సాయిబాబా సేవ చేసుకోవడానికై అతడు శిరిడీలో ఒక భవనాన్ని నిర్మించాడు. అతడు అక్కడే వుంటుండేవాడు. సాయిబాబా మహిమను అతడు బాగా వ్యాపింపజేశాడు(96).

**- సశేషం**



# శ్రీ దత్తలీలామృతము

## (శ్రీ దత్తాత్రేయస్వామి చరిత్ర)



సెప్టెంబరు సంచిక తరువాయి

- శ్రీమతి శ్రీదేవి



విష్ణుదత్తుడు, సుశీల ఆ వేల్పుల ఎదుట సాష్టాంగ నమస్కారము చేసి, చేతులు జోడించి, నిలువ బడ్డారు. అపుడు విష్ణుదత్తుడు శ్రీ దత్తాత్రేయస్వామిని యీ విధముగా అష్టోత్తర శతనామాలతో స్తోత్రము చేశాడు.

విష్ణుదత్త కృత దత్తావతార శత నామములు

శ్లో॥ దత్తాత్రేయం హరిం కృష్ణమున్మాదం ప్రణతోస్మ్యహం
ఆనందదాయకం దేవం మునిబాలం దిగంబరం
పిశాచరూపిణం విష్ణుం వందేహం జ్ఞాన సాగరం
యోగినం భోగినం నగ్నమనసూయాత్మజం కపిం
భోగ మోక్ష ప్రదం వందే సర్వదేవ స్వరూపిణం
ఉరుక్రమం విశాలాక్షం పరమానంద విగ్రహం
వరదం దేవదేవేశం కార్తవీర్య వరప్రదం
నానారూప ధరం హృద్యం భక్త చింతామణిం గురుం
విశ్వవంద్య పదాంభోజం యోగి హృత్పద్మవాసినం
ప్రణతార్తి హరం దేవం కుత్సితాచార్య చేష్టితం
మితాచారం మాతాహరం భక్ష్యాభక్ష్య వివర్జితం
ప్రమాణం ప్రాణ నిలయం సర్వాధారం నతోస్మ్యహం
సిద్ధ సాధకం సంసేవ్యం కపిలం కృష్ణ పింగళం
విప్రవర్యం వేదవిదం వేదవేద్య వియత్సమం
పరాశక్తి పదాశ్లిష్టం రాజ రాజ్య ప్రదం శివం
శుభదం సుందరగ్రీవం సుశీలం శాంత విగ్రహం
యోగినం రామయా స్పృష్టం రామా రామం రామాప్రియం
ప్రణతోస్మి మహాదేవం శరణ్యం భక్త వత్సలం
వీరం వరేణ్యం ఋషభం వృషాచారం వృషప్రియం
అలిప్తమనఘం మేధ్య మనాది మగుణం పరం
అనేకమేక మీశానం అనంత మనికేతనం
అధ్యక్ష మసురారాతిం శమం శాంతం సనాతనం
గుహ్యం గభీరం గహనం గుణజ్ఞం గహ్వర ప్రియం
శ్రీదం శ్రీశం శ్రీనివాసం శ్రీవత్సాంకం పరాయణం
జపం తం జపతాం వంద్యం జయంతం విజయప్రదం
జీవనం జగతస్సేతుం జానానం జాత వేదసం
యజ్ఞమీద్యం యజ్ఞ భుజం యజ్ఞేశం యాజకం యజ:
యాష్టారం ఫలదం వందే సాష్టాంగం పరయా ముదా॥

తనకు దర్శనమిచ్చి తన కోరిక మన్నించి తన యింట పితృశ్రాద్ధమునకు విచ్చేసి తనను కృతార్థుని చేసిన కరుణామయుడు శ్రీ దత్తాత్రేయస్వామిని అశ్రు నయనాలతో స్తోత్రము చేశాడు విష్ణుదత్త సోమయాజి. ఆ స్తోత్రమునాలకించిన స్వామి అతనిని ఈ విధముగా దీవించారు.

"విప్రోత్తమా! నీ సేవలకు సంతసించాను. నీవు చేసిన యీ స్తోత్రము నాకు ఆనందాన్ని కలిగించింది. ఎవరైతే ఈ స్తోత్రమును ప్రతిరోజు భక్తితో పఠిస్తారో వారు నా అనుగ్రహానికి పాత్రులౌతారు. నీ సహధర్మ చారిణి, పతివ్రతా శిరోమణి అయిన సుశీల మహాత్మ్యాన్ని ప్రత్యక్షంగానే చూశాను. నీవు సకల విద్యానిధివి. నీకు ఆమె తగిన యిల్లాలు. నీవు ఆమెకు తగినవాడవు. శీలము, ధర్మము మొదలైన సద్గుణ సంపదను కలిగి యుండటంలో మీ యిరువురు ఒకరిని మించిన వారు మరొకరుగా వున్నారు. మీ దంపతులిద్దరు జీవితమంతా సకల సౌఖ్యములతో ఆయురారోగ్య ఐశ్వర్యములతో ఆనందంగా వుంటారు. జీవితాంతములో ముక్తిని పొందుతారు. ధర్మాత్ములు, నా భక్తులు అయిన మీకింక పునర్జన్మవుండదు. విష్ణుదత్తా! ఇప్పుడు చెప్పు. మిమ్మల్ని సంపూర్ణంగా అనుగ్రహించాను. ఇంకా మీకేమి కావాలి?

మీ కోరికలన్నీ నెరవేర్చ సిద్ధముగా వున్నాను. సంకోచము లేకుండా కోరుకో నాయనా!"

భక్తి పారవశ్యంలో విష్ణుదత్తునికి నోటమాట రావటంలేదు. ఆనందాశ్రువులు ధారలుగా కారుతున్నాయి. స్వామినే చూస్తూ మౌనంగా వుండి పోయాడు విష్ణుదత్తుడు.

స్వామి అన్నారు,"నిత్యసంతృప్తులు అయిన మీకు కోరికలేమీ వుండవని నాకు తెలుసు. కనుక నేనే ఒక మహిమాన్వితమైన మంత్రమునిస్తాను. ఓ విప్రోత్తమా! పరమ శుభప్రదమైన యీ మంత్రము వలన ఆయురారోగ్య ఐశ్వర్యాలు, ధనధాన్యాలు, సంతానము, సకల సంపదలు, కీర్తిప్రతిష్టలు, రాజ్యము-యిలా ఏది కోరినా లభిస్తాయి. ఈ మంత్రము వలన కోరికలు నెరవేరుట నీకు మాత్రమే కాదు, మనుష్యులకైనా, దేవతలకైనా సరే నీ యిష్టానుసారము నీవు వారికి కోరినది ప్రసాదించగలవు. ఇందు ఎంతమాత్రము సందేహించనవసరం లేదు. నా అనుగ్రహముతో నీ పితృదేవతలు కర్మపాశ విముక్తులై స్వర్గము నుండి బ్రహ్మలోకానికి వెళ్లి బ్రహ్మదేవునితో కలసి ముక్తిని పొందగలరు. నీ యింటిముంగిట భూతబలి అన్నము తిని నీ పట్ల కృతజ్ఞతతో నీకు మహోపకారము చేసిన బ్రహ్మరాక్షసుడు ఆ పుణ్యము వలన ఆ రూపము నుండి విముక్తుడై నా ఆజ్ఞానుసారం స్వర్గము పొందుగాక!"

**ఈ విధముగా అందరినీ దీవించిన స్వామి విష్ణుదత్తుని చెవిలో మంత్రోపదేశము చేసి ఆ దంపతులను హస్తమస్తక సంయోగము (శిరస్సులపై చేయిపట్టి అనుగ్రహించుట)తో దీవించి అంతలోనే మెరుపులాగా అదృశ్యులైపోయారు.**

ఆ తర్వాత సూర్యభగవానుడు ఆ దంపతులను దీవించి, "మీకు దివ్యమైన సిద్ధగతి, కామగమనము(కోరిన చోటికి వెళ్లగలిగేది) కలిగిన విమానమును ప్రసాదిస్తున్నాను. మీరు స్మరించిన మాత్రమున దర్శన మిస్తాను." అని పలికి ఆ దంపతుల నమస్కారములను స్వీకరించి అదృశ్యుడైనారు.

అగ్నిదేవుడు ఆ దంపతుల స్తోత్రమును విని ఎంతో సంతోషించి, "మీరు కోరినపుడు ప్రత్యక్షమవుతాను. మీ అభీష్టములన్నీ నెరవేరుస్తాను. మీ కర్మ నిష్ట ఎంతటి గొప్పదో మీరు నిత్యము నన్ను అర్చించే విధానము లోనే స్పష్టమవుతున్నది. ఓ విష్ణుదత్తసోమయాజీ! దివ్య తేజస్సుతో వెలుగుతూ మహామహిమాన్వితుడవైన నీవు నిత్య సంతోషముతో జీవితాంతము సుఖించటమే కాక సకల జీవులకు సుఖసౌఖ్యాలు ప్రసాదిస్తూ ఆర్తుల బాధలు తీర్చే పుణ్యాత్ముడవై జీవిస్తావని నిన్ను ఆశీర్వదిస్తున్నాను"అని వారిని దీవించి, ఆ యింటి హోమగుండములోకి ప్రవేశించి అదృశ్యుడైనాడు.

రావిచెట్టు దిగి వచ్చిన బ్రహ్మరాక్షసుడు విష్ణుదత్తునికి, సుశీలకు సాష్టాంగ నమస్కారములాచరించి, **"పుణ్యాత్ములైన మీ వలన దత్తానుగ్రహాన్ని పొందాను. ఈ రాక్షస జన్మనుండి విముక్తి పొందాను. కృతార్థుడను."** అని పలికి స్వర్గలోకానికి వెళ్లిపోయాడు.

బృహస్పతిచే విష్ణుదత్తుని కథవిన్న ఇంద్రుడు గురువును యిలా ప్రశ్నించాడు. "గురుదేవా! శ్రీ దత్తాత్రేయ స్వామి విష్ణుదత్తుని పట్ల ప్రసన్నులై ఎన్నో వరములు యిచ్చారు. మహా మహిమాన్వితము అయిన మంత్రమును కూడా ఉపదేశించారు. ఆ తర్వాత విష్ణుదత్తుడేమి చేశాడు? గొప్పవరములను, దివ్యమంత్రాన్ని పొంది అతడు లోకానికి ఎటువంటి సహాయము చేశాడు? సాటివారి బాధలను తొలగించి కాపాడగలిగాడా? 'సర్వదేహులను సుఖపెట్టువాడవు కాగలవ'ని అగ్నిదేవుడు కూడా విష్ణుదత్తుని దీవించాడు కదా, మరి ఆ దీవెన ఏ విధంగా ఫలించింది? ఆ వివరములన్నీ నాకు చెప్పి, నన్ను కృతార్థుని చేయమని ప్రార్థిస్తున్నాను."

శిష్యుని కోరిక విన్న బృహస్పతి విష్ణుదత్తుని చరిత్రను యిలా కొనసాగించాడు-

"ఇంద్రా! ఎంతో వినమ్రుడు, శీలసంపన్నుడు అయిన విష్ణుదత్తుడు దేవతలనుండి అంతటి గొప్పవరములు పొంది కూడా ఏమాత్రము గర్వించలేదు. తన అదృష్టానికి ఉప్పొంగి విర్రవీగలేదు. మరింత వినయసంపన్నత కలిగి, శాంతమనస్కుడై, దానధర్మరతుడై వెలిగాడు. సదాచారరతుడై, సుశీలుడై, దయార్ద్రహృదయుడై, నిరంతరము పరోపకారములో నిమగ్నుడై సర్వజనులకు ప్రీతిపాత్రుడైనాడు. సర్వనదులు తనలో కలుపుకొన్న సముద్రుని లాగా, నిండు కుండ లాగా నిర్లిప్తుడై, నిశ్చలమానసుడై అహంకార రహితుడై జీవించాడు. తన మహత్యాన్ని గూర్చి ఎప్పుడూ ఎవరివద్దా చెప్పుకొనలేదు. అతడీ విధంగా నివురుగప్పిన నిప్పులాగా మేఘములచే కప్పబడిన సూర్యునిలాగా నిగూఢముగ వున్నప్పటికీ అతని మహత్యం క్రమక్రమంగా ఆ నోటా, యీనోటా గ్రామములలోను, పట్టణములలోనూ, రాష్ట్రమంతటా వ్యాపించ సాగింది. మల్లెల పరిమళాలను దాచటం ఎవరికి సాధ్యం? ఇంద్రా! ఇందుకు ఉదాహరణగా నేనొక వాస్తవ గాధను నీకిప్పుడు చెపుతాను, విను"

అంటూ బృహస్పతి ఐదవ కథను యీ విధంగా చెప్పనారంభించాడు.

సహ్యాద్రికి కొద్ది దూరంలో కుశావర్తము అనే పేరుగల పుణ్యక్షేత్రం వున్నది. ఆ క్షేత్రంలో వేదవేదాంగ పారంగతులైన బ్రాహ్మణోత్తములు ఎందరో వున్నారు. వారిలో ఒక ఉత్తమ గుణసంపన్నుడైన బ్రాహ్మణుడుండేవాడు. అతడికి లేక లేక ఒక కుమారుడు జన్మించాడు. అయితే పుత్రుడు జన్మించాడన్న సంతోషం ఎక్కువ రోజులు నిలువలేదు. కారణం పుట్టుకతోనే ఆ బాలుడు వ్యాధిగ్రస్తుడుగా వుండటమే. ఆ పిల్లవాని పూర్వపాపమెలాంటిదో గానీ వాత గుల్మరోగములతో తీవ్ర బాధననుభవిస్తుండేవాడు. వయస్సు పెరిగే కొద్దీ అతనికి కొత్త కొత్త వ్యాధులు సంక్రమించి పీడించసాగాయి. అతని తల్లిదండ్రులు తమకు ఎంతో కాలం తర్వాత, వృద్ధాప్యం సమీపిస్తున్న తరుణంలో కలిగిన ఆ ఒక్క బిడ్డ అలా వ్యాధులతో అలమటిస్తుండటంతో ఎంతో చింతించ సాగారు. 'తమ కుమారుడికి వివాహ వయస్సువచ్చేసరికి ఇంకెన్ని వ్యాధులు సంక్రమిస్తాయో! అప్పుడతనికి పిల్లనెవరిస్తారు? ఈ రోగిష్టి బిడ్డకు పెండ్లి కావటమే కష్టం' అనుకొని వారు చిన్నతనంలోనే 'సుమేధ' అనే పేరుగల ఒక చక్కని కన్యతో వివాహం చేసి, కొంతకాలం తర్వాత వారు గతించారు. అతడు ఒంటరివాడైనాడు. వివిధరోగములచే పీడింపబడుతూ శుశ్రూష చేసేవారు లేక అతడు పడుతున్న అవస్థ చూసి సుమేధ తండ్రి తన కుమార్తెను భర్త యింటికి పంపాడు. అతి చిన్న వయస్కురాలైన సుమేధ భర్తకు సేవలు చేస్తూ కంటికి రెప్పలుగా కాపాడుతున్నప్పటికీ కాలం గడుస్తున్న కొద్దీ అతని ఆరోగ్యము క్షీణించ సాగింది. ఎటువంటి ఔషధములూ అతని వ్యాధులు తగ్గించ లేకపోగా రాను రాను అతని పరిస్థితి విషమించ సాగింది. అలా కొన్ని సంవత్సరాలు గడిచాయి.

సుమేధకు పదహారేండ్లు వచ్చాయి. కృష్ణపక్ష చంద్రుని లాగా రోజు రోజుకు క్షీణిస్తున్న భర్తను చూసి ఆమె ఎంతో కలత చెందింది. అలా వుండగా ఆమె భర్త పరిస్థితిని చూచిన యిరుగు పొరుగువారు విష్ణుదత్త సోమయాజి గురించి ఆమెకు చెప్పారు. ఆయన శ్రీ దత్తాత్రేయ స్వామి భక్తులనీ ఆయన వద్దకు వెళితే వారి ఆశీస్సులతో సుమేధ భర్త ఆరోగ్యవంతుడౌతాడనీ, అలా ఎందరో ఆయన వలన బాధావిముక్తులైనారనీ చెప్పగా ఆమె తన తండ్రిని పిలిపించుకొని, విష్ణుదత్తుని వద్దకు వెళ్లింది.

విష్ణుదత్తుని దర్శించిన సుమేధకు దు:ఖం పొంగి వచ్చింది. చల్లగాలి తగులగానే వర్షించిన నీలిమేఘం లాగా ఆ భగవద్భక్తుని చూడగనే రెండుచేతులూ జోడించి ఆయనకు నమస్కరించి, చీరకొంగు ముఖంపై కప్పుకుని బిగ్గరగా ఏడ్వసాగింది. ఆ సంఘటనతో విచలితుడైన విష్ణుదత్తుడు, "అమ్మా! ఎవరునీవు? ఎందుకేడుస్తున్నావు? నీకు వచ్చిన కష్టము ఏమిటి? ఎటువంటి కష్టాలనైనా తీర్చే దత్తస్వామి మన అండన వుండగా మనకేమీ భయంలేదు తల్లీ! ఏడువకు తల్లీ! నీ సమస్య ఏమిటో చెప్పు" అంటూ ఎంతో అనునయంతో ఆమెను ప్రశ్నించాడు.

"ఏడవకమ్మా! విష్ణుదత్త గురుదేవుల అండన చేరినవారి గండములన్నీ గట్టెక్కుతాయి. దిగులు పడకు తల్లీ!" అంటూ కుమార్తెను ఓదార్చి, ఆమె తండ్రి శ్రీ విష్ణుదత్తునితో యిలా అన్నారు-"అయ్యా! ఈమె నా కూతురు. ఈమె భర్త యిరువది సంవత్సరాల వయస్కుడు. అతని తల్లీ, తండ్రీ చాలా కాలం క్రిందటే గతించారు. పుట్టుకతోనే రోగిష్టి అయిన అతనికి శుశ్రూషచేసేవారు లేకపోవటంతో నా కుమార్తెను చిన్న వయస్సులోనే భర్త యింటికి పంపాను. చిన్న పిల్ల అయినా ఎంతో ఓర్పుతో భర్తయే దైవమని భావించి, సకల పరిచర్యలూ చేస్తున్నది. పుట్టుకతోనే అతనికి వాతగుల్మరోగమున్నది. ఎనిమిది సంవత్సరములనుండీ జలోదరము బాధిస్తున్నది. సంవత్సరమునుండీ జీర్ణజ్వరం వేధిస్తున్నది. ఇవిచాలక ఆరు మాసములనుండి అతిసారము, మూడునెలల నుండీ భగందరము పీడిస్తున్నాయి. నిన్నటి నుండీ త్రిదోషము సంక్రమించి, చావసిద్ధమైవున్నాడు. ఆ ఘటం తప్పితే పిల్లకు నా అన్నవారెవ్వరూలేరు. చిన్నపిల్ల అయినా "నా భర్తయేనా సర్వస్వం. వారి సేవచేసుకుంటూ తరిస్తాను" అంటూ భర్తయింటికి వెళ్లి నానా కష్టాలూ పడుతున్నది. ఉన్న ధనమంతా పోసి వైద్యులను పిలిపించి మందులిప్పించినది. ఎక్కడకు పోతున్నాయో ఆ మందులన్నీ! రాను రాను కొత్తరోగములు పుట్టుకొస్తున్నాయి గానీ వున్న వ్యాధులు కొంచమైనా తగ్గటం లేదు. ఎవరేమి చెపితే అది చేసింది ఎన్నో దాన ధర్మాలు చేసింది, నోములు వ్రతాలు చేసింది. పుట్ట పుట్టకు పాలు పోసింది. చెట్టు చెట్టుకు ప్రదక్షిణలు చేసింది. వేల్పులకు మొక్కింది. ముడుపులు కట్టింది. భర్తను రక్షించుకొనటంకోసం నానా శ్రమలు పడుతున్నది. తండ్రీ! పిల్లకు నేను కాదు తండ్రిని మీరే. మీరే పిల్ల జీవితం కాపాడండి. దాని కష్టాలు గట్టెక్కించండి." అంటూ విష్ణుదత్తుని పాదాలపై బడ్డాడు సుమేధ తండ్రి.

- సశేషం

# వార్తాలాపము

సెప్టెంబరు సంచిక తరువాయి **(సీరియల్)**

ఒకమారు ఒక బ్రాహ్మణుడు స్నానముచేయుటకు సరోవరమునకు వెళ్ళెను. స్నానముచేసి వచ్చుచు తన ధోవతి ఉతికికొని, పిండి, భుజముపై వేసికొనెను. ఇంటికి వచ్చినతరువాత ఆ ధోవతిని ఆరబెట్టుటకు విదల్చెను. దాని లోపలనుండి ఒక చిన్న చేపపిల్ల బయటపడి గిలగిల కొట్టుకొనసాగెను. బ్రాహ్మణుడు దయకలిగి ఒక కుండలో నీరుపోసి దానిలో ఈ చేపపిల్లను వేసి చెరువువద్దకు తీసికొనివెళ్ళి కుండను అందులో విడచెను. చేపపిల్ల ఎంతయో ఆనందించెను. కుండ నుండి చెరువులోనికి వెళ్ళుచు మరల చెరువు నుండి కుండలోనికి వచ్చుచు చేపపిల్ల ఎంతయో ఆనందమును పొందుచుండెను. రెండుచోట్లను నీరు ఉండుటయే ఇందుకు కారణము.

ఈ విధముగనే ఒకమారు జీవునకును బ్రహ్మమునకును మధ్యకల తెర పడిపోయినచో సమాధిదశయందు ఉన్నను, ఉత్థానదశయందున్నను ఆనందము సమానముగానే కలుగును ఇక దు:ఖమునకు అవకాశమేది?

ఈ విషయమున శంకరభగవత్పాదుల వాక్యములను వినుడు.

దేహాభిమానే గలితే విజ్ఞాతే పరమాత్మని।

యత్ర యత్ర మనో యాతి తత్ర తత్ర సమాధయః॥

"దేహాభిమానము నశించి పరమాత్మజ్ఞానము కలిగిన తరువాత మనస్సు వెళ్లిన ప్రతిచోటకును సమాధికూడ వెళ్ళును."

స్వా.ని.:- **తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట రాగము మొదలగు మలినవాసనలు ఉండవు.** దరిద్రుడెవడైన చక్రవర్తి అయినచో ఆతనికి దారిద్ర్యమువలన కలిగిన దు:ఖములు పోవును. కాని వ్యాధి జన్యములగు దు:ఖములు నివృత్తిని పొందవు. అటులనే జ్ఞానికి అవిద్యా జన్యములగు దు:ఖములు నివృత్తిని పొందినపిమ్మట బ్రహ్మానంద సామ్రాజ్యము లభించును. కాని ప్రారబ్ధకర్మములవలన శరీరమునందు రోగాదిజన్యములగు దు:ఖములు మాత్రము కన్పట్టుచున్నవి. అవియును తత్త్వజ్ఞానికి బాధితానువృత్తిరూపమున ప్రతీతమగుచున్నవి. ఆందున భేదము కలదు. **నిర్వికల్పసమాధి రెండురకములు.**

**1.అద్వైతభావన, 2. అద్వైతఅవస్థ.**

అద్వైతభావమును పొందినవానికి ఆవరణభంగము అయిన పిమ్మట వృత్తి భావరూపమును పొందుటచే దు:ఖములు బాధితాను వృత్తి రూపమున ప్రతీతములగును. అశుద్ధసత్త్వగుణప్రధానమగు బ్రహ్మాకారవృత్తికూడ స్వరూపమునందు లయమును పొందును. అది అద్వైతావస్థ అనబడు నిర్వికల్పము. అదియే గుణాతీతునకు దు:ఖములకూడ బాధితాను వృతిరూపము ప్రతీతములు కావు. ఇది ఛాందోగ్యోపనిషత్తునందు చెప్పబడినది.

**"బ్రహ్మవేత్త మృత్యువును చూడడు. రోగమును చూడడు. శీతోష్ణాది సుఖదు:ఖములను చూడడు. 'బ్రహ్మవేత్త అన్నిటిని స్వస్వరూపములుగనే చూచును. అన్నివిధములుగను అన్నిటియందును సర్వాత్మకమగు బ్రహ్మస్వరూపమును పొందును."**

వైద్యరా :- అద్వైతానుభావన అను నిర్వికల్ప సమాధినుండి అద్వైతఅవస్థ అనబడు నిర్వికల్పసమాధినలోనికి వెళ్లుటకు సాధనమేమి?

స్వా॥ని॥ :- **తత్త్వజ్ఞానము కలిగినపిమ్మట జనుల సంసర్గములోనుండి ఉపదేశాది సాత్త్వికప్రవృత్తులను కలిగియుండు జ్ఞానులు అద్వైతానుభావమున వుందురు ఈ అద్వైతానుభావమునందుకూడ భేదములు కలవు. జ్ఞానభూమికలు ఏడు :- (1) శుభేచ్ఛ, (2) విచారణ, (3) తనుమానస, (4) సత్వాపత్తి, (5) అసంసక్తి, (6) పదార్థభావిని, (7) తురీయ.**

వీనిలో మొదటిమూడును సాధనకోటికి సంబంధించినవి. మిగిలిన నాలుగును జ్ఞానకోటికి చెందినవి సత్త్వాపత్తి, అసంసక్తి, పదార్థభావిని, తురీయ అను ఈ శ్రేణికి చెందినవారు క్రమముగ బ్రహ్మవిదుడు, బ్రహ్మవిద్వరుడు,

బ్రహ్మవిద్వరీయసుడు, బ్రహ్మవిద్వరిష్ఠుడు అనబడుదరు. వశిష్ఠుడు, యాజ్ఞవల్క్యుడు మొదలగు నాలుగవ భూమికయందు ఉన్నవారు బ్రహ్మవిదులని చెప్పబడెడివారు. జనులకు ఉపదేశించుట మొదలగు సాత్వికప్రవృత్తులనుకూడ కలిగియుండెడివారు. **శుకుడు మొదలగు ఐదవ భూమికయందలివారు బ్రహ్మవిద్వరులనబడెడివారు.**

ఇట్టివారు ఈ జగమున నిర్ద్వంద్వులుగా తిరిగెడివారు. ఇట్టివారలనుగురించి శంకరులు చెప్పిరి.

దిగమ్బరో వా పి చ సామ్బరో వాత్వగమ్బరో వా పి చిదమ్బరస్థః।

ఉన్మత్తవద్వా పి చ బాలవద్వా పిశాచవద్వా పి చరత్యవన్యామ్॥

**"చైతన్యాకాశమున నున్న బ్రహ్మజ్ఞుడు వస్త్రము లేకుండగనో, లేక వస్త్రముతోనో, లేక చెట్లఆకులు మొదలగునవి ధరించియో, లేక వెర్రివానివలెనో, లేక బాలునివలెనో, లేక పిశాచమువలెనో ఈ భూమిపై సంచరించును**."

నేను పూర్వాశ్రమమున బెల్గాములోనున్నపుడు హనుమానుగలీలో బ్రహ్మనిష్ఠుడగు మహాత్ముడు ఒకడు ఉండెనని విని ఆయన దర్శనమునకు వెళ్లితిని. ఆతని కేశములు చిందరవందరగా నుండెను. గడ్డము మొదలగువానితో చూచినవారికి మహాభయంకరముగా నుండెను. అక్కడ ఒక బ్రాహ్మణఅగ్రహారము కలదు. ఆ అగ్రహారము మధ్యనే హనుమానునిమందిరము ఉండెను. ఆ మహాత్ముని చూచుటకు నేను
వెళ్ళుసరికి ఆయన బ్రాహ్మణులు భోజనముచేసి పారవేసిన ఆకులను ఏరుకొని చంకలో నిడుకొని తిరుగుచుండెను. "ఈ విధముగానుండు మనుష్యుడు మహాత్ముడు ఎట్లగును?" అని నాకు తోచెను. ఈ సందేహము నాకు కలుగు సమయమున అక్కడకు ఒక బ్రాహ్మణుడు ఆయనకు సేవచేయుటకు వచ్చుచుండెను. బాలచాపల్యముతో నేను అతనిని అడిగితిని" ఈ మహాత్ముని నీవు ఇంత ఎక్కువగా సేవించుచున్నావు. ఈయనయందు ఎంతయో పూజ్యభావమును కలిగియున్నావు నీకేమైన లాభము కలిగినదా?' 'అంతట అతడు ఇట్లు చెప్పెను. నేను చెప్పినచో అహంకారము అనుకొనెదరు. లేనిచో అసత్యము పలుకవలసి వచ్చును. ఏమి చెప్పను!" ఆ మహాత్ముడు పిచ్చివాడు కాదనుభావము నాకు కలిగెను. అయినను నాకు సందేహము పోలేదు. బెల్గామునుండి 17,18 మైళ్ళుదూరమున అమ్మవారి గుడి యుండెను. ఆవిడ మహాత్మ్యము చాలా గొప్పదని అందరు చెప్పిడివారు ఏదైన రోగము వచ్చినచో ఎట్లు తగ్గును? తగ్గునా, తగ్గదా అనునది ఆవిడ చెప్పెడిదట అందరును ఆమెను అడుగుటకు వెళ్ళెడివారు. ఆ గ్రామమున ఒక వ్యాపారి ఉండెను. అతనికి కడుపులో పోటు వచ్చి దానిచే ఆతడు చాలా బాధ పడుచుండెను. ఎన్నిమందులు వేసినను బాధ తగ్గలేదు. ఆతడు కూడ అమ్మవారివద్దకు అడుగుటకు వచ్చెను. ధూపముతో అమ్మవారు పూని చెప్పెను. మా గ్రామమునందలి హనుమాన్‌గలీలో ఒక మహాత్ముడు కలడు. ఆయనకు మూడుపూటలు భోజనము పంపినచో ఈ బాధ తగ్గిపోవును. అటు తరువాత ఆ వ్యాపారి అటులనే చేసెను. ఆతని బాధలు పోయెను. అప్పటినుండి ఆతడు ప్రతిరోజు ఆయనకు భోజనము పంపెడివాడు. ఇది చూచిన తరువాత ఆ మహాత్ముడు పిచ్చివాడుకాడు, జ్ఞాని అను నమ్మకము కలిగెను. పంచమభూమికయందున్నవారు ఇట్లు పిచ్చివానివలెను, బాలునివలెను ఉందురు. వీరివృత్తి అంతర్ముఖమయినకొలదియు దేహభావము తగ్గుచుండును.

ఆరవభూమికయందు నడచుట, నములుట, చూచుట మొదలగు క్రియలు ఆగిపోవును. చూచుట ఆగిపోవును అనగా కన్ను మూతపడదు. కాని శవమువలె చపలత్వరహితముగ నుండును, 1954 విక్రమశకమున (1897 క్రీ॥ శ॥) కుంభకోణమునందు ఒక మహాత్ముని ఈ స్థితిలో చూచితిని. ఆ గ్రామస్థులు 38 సంవత్సరములు ఆయన ఆ స్థితిలో ఉన్నాడని చెప్పిరి. తరువాత 5 సంవత్సరములు జీవించెను.

7వ భూమికయందున్నవాడు బ్రహ్మవిద్వరిష్ఠుడు, ఏడవ భూమికయందు శరీరము 21 రోజులు
వుండును అని చెప్పదురు. తత్త్వజ్ఞానముతోబాటు జీవన్ముక్తి కలుగును. ఈ రెంటియందున భేదము లేదు.

వైద్యరాజు :- కొందరు విద్వాంసులు తత్త్వజ్ఞానము కలిగిన తరువాత అవిద్యాలేశము ఉండును అని చెప్పదురు దాని నివృత్తి కొరకు మరల యోగమును చేయవలెనా?

స్వా.ని. :- అవిద్యయందు రెండు అంశములు కలవు. 1. ఆవరణము 2. విక్షేపము ఆవరణాంశము తత్త్వజ్ఞానముతో బాటు నశించును. విక్షేపాంశము ప్రారబ్ధకర్మక్షయమువరకును ఉండును.

తస్య తావదేవ చిరం యావన్న విమోక్ష్యే థ సంపత్స్యే।

**ప్రారబ్ధకర్మక్షయము అగునంతవరకు మాత్రమే ఆతనికి ఆత్మప్రాప్తి కలుగుట ఆలస్యమగును. ప్రారబ్ధకర్మము నశించి శరీరపాతము అయినంతనే అతనికి సద్వస్తువు లభించును.**

కాని అజ్ఞానులు ముక్తిని పొందువరకు ఎదురుచూచుచుందురు. అనగా ప్రారబ్ధక్షయమును ఎదురుచూచుచుందురు, ప్రారబ్ధక్షయము అగుటచే పరబ్రహ్మమునందు లీనమగుదురు. కానీ **తత్త్వజ్ఞానము కలిగిన తరువాత యోగాభ్యాసముచేయుట అనగా కుమారుడు పుట్టిన తరువాత పెండ్లిచేసికొనుటవంటిది**.

స్వా. ప్ర. :- ఒకమారు నేను "వాంసదా" వెళ్ళితిని. సంభాషణలో వింటిని. అచ్చటి భిల్లులు కార్యముచేసికొని ఇద్దరు పిల్లలు పుట్టినతరువాత పెండ్లి చేసికొనెదరట. తల్లిదండ్రులు పెండ్లిసమయమున పిల్లలఎదుట ఒట్టుపెట్టుకొనెదరు. ఇది ఏమిటి అని ప్రశ్నించగా ఇట్లు సమాధానము వచ్చెను. "ఇది అడవిజాతి. మాటి మాటికి కల్లు త్రాగి కొట్టుకొని విడాకులు పుచ్చుకొనెదరు. కాని పిల్లలు పుట్టినచో వారియందలి ప్రేమచే అట్లు చేయలేరు. అందుచేతనే అట్లు పెండ్లాడెదరు. ఇది భిల్లుమతము." ఇది విని అందరూ నవ్విరి.

వైద్యరాజ :- ఇక్కడికే ఒక స్వామి వచ్చిరి. వారు విద్వాంసులు. మనస్వామి వారితో వారుకూడ చర్చించుచుండిరి." తత్త్వజ్ఞానము కలిగినతరువాత కూడ ప్రారబ్ధానుసారము భోగేచ్ఛయుండునుఅని వారివాదము. శ్రీ నిత్యానందస్వామివారు భోగేచ్ఛ అసురగణము. జ్ఞానికి ఎట్లు కలుగును?" అని ప్రశ్నించిరి. అ స్వామి తనవాదమును మొండిగా నిలబెట్టుకొనసాగెను. అంతట స్వామివారు మౌనము వహించిరి.

స్వా. ప్ర. :- నాప్తోపదేశం సంవేత్తి విద్యామత్త: స్వహేతుభి:।
అనర్థమప్యభిప్రేతం మన్యతే పరమార్థవత్॥

"విద్యామదముకలవాడు ఆప్తవాక్యమును తనకు కష్టము కలుగుననుభావముతో అంగీకరించడు. తనకు అనుకూలముగా నున్నచో అనర్థకరమగు అభిప్రాయమునుకూడ పరమార్థమువలె భావించి అంగీకరించును."

నేటి విద్వాంసులకు శాస్త్రములయందు శ్రద్ధలేదు. వారు విషయాదులయందు ప్రవర్తించు చిత్తవృత్తులను ఆపుకొనలేరు. ఆ కారణముచే తమ దుర్నీతిని అనుసరించియే శాస్త్రార్థమును చెప్పెదరు అంతేకాదు. శ్రుతి, స్మృతుల టీకలుకూడ తమకు అనుకూలమగునట్లుగనే చెప్పదురు. అందుచేతనే మహాత్ములు చెప్పిరి.

భక్త్యాభాగవతం శాస్త్రం న వ్యుత్పత్త్యా న టీకయా।
గృహిణ్యైవ గృహం ప్రోక్తం న పుంశ్చల్యా న వేశ్యయా॥

"భగవత్ప్రతిపాదితము శాస్త్రార్థము భక్తిచేతనే నిర్ణయించబడును. వ్యుత్పత్తులు చెప్పికాని టీకలు వ్రాసికాని నిర్ణయించబడదు. గృహిణి ఉన్నది గృహము. అంతేకాని పురుషులను చూచినంతనే ఉద్రేకమును చెందు కులత కాని, వేశ్యకాని ఉన్న గృహము గృహము కాదు."

**అనగా శాస్త్రాభ్యాసము చేసినను శ్రద్ధాభక్తులతో ప్రభుపరాయణులు కానంతవరకు నిజమగు బోధ కలుగదు**. శ్రద్ధాభక్తులతో ప్రభుపరాయణులగువారిని గురించి భగావానుడు గీతలో చెప్పెను.

తేషాం సతతయుక్తానం భజతాం ప్రీతిపూర్వకమ్।
దదామి బుద్ధియోగం తం యేన మాముపయాన్తి తే॥

**"పరమేశ్వరునియందు ఏకాగ్రబుద్ధి కలిగి, ప్రేమతో పరమేశ్వరుని భజించు భక్తులకు బుద్ధియోగము లభించును. ఆ బుద్ధియోగముచేవారు తమ ఆత్మరూపమును పొందుదురు. ఆ బుద్ధియోగమును నేను వారికి కలుగజేయుదును."**

**- సశేషం**

# ఆధ్యాత్మికత అంటే ఏమిటి?

## జిల్లెళ్ళమూడి అమ్మతో ఆచార్యుల సంభాషణ

జిల్లెళ్ళమూడి అమ్మ :- అసలు ఆధ్యాత్మికత అంటే ఏమని రాస్తున్నావు నాన్నా?

ఆచార్యులు :- అమ్మా?

అమ్మ:- అధ్యాత్మికత అంటే ఏమని చెబుదాం జనానికి? అంటే చెప్పదల్చుకున్నప్పుడు ఈ ఆధ్యాత్మికత అంటే ఏమిటని చెబుతాం?

ఆచార్యులు:- "నేను" అనబడు దానియొక్క నిజతత్త్వమే "ఆత్మ". ఆత్మ అంటే సంస్కృతంలో "నేను"; "ఆధ్యాత్మికత" అంటే ఈ "నేను" అనే దానియొక్క నిజతత్త్వం ఏమిటో దానికి సంబంధించినది. అది తెలిసినప్పుడు. ఎన్ని ఉన్నా ఇంకా లేదనే అసంతృప్తితో మనిషిని పీడిస్తున్నదే, దాని నుంచి విముక్తి కలుగుతుంది.

అమ్మ:- అచ్ఛా..

ఆచార్యులు:- **అన్యాయానికీ, అధర్మానికీ, దోపిడీకి. ఈ అసంతృప్తే మూల కారణం.** అన్యాయానికీ, అధర్మానికీ వస్తువుల మీద వ్యామోహం తగ్గుతూ వచ్చి, అవసరమైన వస్తువులకు మాత్రమే పరిమితమై జీవించే విధానం వస్తుంది; అది 'ధర్మార్థ కామమోక్షాలు' (సాధించుకునే జీవన విధానము).

**కాబట్టి (ఆధ్యాత్మికతకు) పరలోకంతో సంబంధం లేదు; పునర్జన్మతో అంతకంటే సంబంధం లేదు; పుణ్యపాపాలు, లోకాలతో అంతకంటే సంబంధం లేదు; ఇక్కడున్న మనిషిని తీసుకుని, వాడియొక్క సమస్యను తీసుకుని, "దానికి సమాధానం నీ యొక్క తత్త్వంలోనే ఉన్నది. నీ తత్త్వం ఒకరకంగా పనిజేస్తుండటం మూలాన ఈ పరిస్థితులన్నీ ఏర్పడుతున్నాయి; దానియొక్కతత్త్వం సరిగ్గా అర్థమయ్యేటప్పటికీ ఇవన్నీ వాటంతటవే సద్దుకుంటున్నాయి", అనే సమన్వయం ఇక్కడనుంచే చెప్తున్నామన్నమాట.**

అందువల్ల సహేతుకంగానూ, ఈ లోకాలూ,

> **జీవితంలో తనకేంగావాలో తనకు స్పష్టమైన తరువాత, తృప్తి, శాంతి పొందేందుకు గనక మార్గం దొరికితే ఆ తరువాత వాడికి వీటికోసం పరుగెత్తి అమానుషంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉండదు;**

వీటన్నిటికీ గూడా ఎన్ని ఉన్నా గానీ ఇంకా ఏమో లేదన్న తపన; వస్తువుల్నీ, వాటిని మూటగట్టడం ద్వారా దానిని తీర్చుకుందామనే తపన ప్రపంచంలో కారణమవుతోంది; అదేమో అధర్మానికీ, దోపిడీకి కారణమవుతుంది; అందుకని జీవితంలో తనకేంగావాలో తనకు స్పష్టమైన తరువాత, తృప్తి, శాంతి పొందేందుకు గనక మార్గం దొరికితే ఆ తరువాత వాడికి వీటికోసం పరుగెత్తి అమానుషంగా ప్రవర్తించాల్సిన అవసరం ఉండదు; తృప్తి శాంతులు ఈ మూటగట్టడం వలన వస్తాయన్నది, మానవజాతి అనుభవం చూస్తే వీటి వలన రావని తేల్తోంది. అయితే ఎలాగా అని ఆలోచిస్తే, **'నేను' అనబడుదాని యొక్క నిజతత్త్వం గనగ తెలిస్తే అదే వీడు అన్వేషిస్తున్న తృప్తి-శాంతుల యొక్క రూపము;** తనలో పెట్టుకున్న వస్తువును బయట వెతుక్కుంటున్నాడు; కాబట్టి 'నేను' అనే దానియొక్క నిజతత్త్వం గనక తెలిసినట్లైతే, తృప్తి-శాంతులకు మనస్సు చేరువౌతున్నకొద్దీ బాహ్యమైన జన్మలు-గిన్మలు అంటే నచనటువంటి యువతరానికి ఉన్నదే, ఇది ఇంకోరకంగా చెప్పేందుకు దారి చిక్కక పోవడంచేత వాడు తిరిగి ఆలోచించవలసి వస్తోంది. "మతం ఎందుకు?" అన్న పేరుతో వ్రాసానమ్మా దీని గురించి.

అమ్మ :- ఒకటి 'ఏది నిజం' అని వ్రాసావు కదా?

ఆచార్యులు :- అవును. దాని తరువాత "నిజానికి నిచ్చెనలు" అన్న పేరుతో వ్రాసి దానిని "మతం ఎందుకు" అన్న పేరుతో రెండవ ముద్రణ ఇప్పుడు చేయించానమ్మా.

# అర్ధాంగి

- శ్రీమతి శ్రీదేవి

తల్లి అంటే తొలి అని అర్ధం. జగత్తు అంతటికీ తొలి వంద్యనీయురాలు తల్లియే. ''మాతృదేవోభవ! పితృదేవోభవ!'' అన్న నానుడిననుసరించి యీ సృష్టిలో మనుష్యులకేగాక పశుపక్ష్యాది జీవజాలమంతటికీ తమకు జన్మనిచ్చే తల్లికి ప్రధమ స్ధానం వున్నది. అంతేకాదు మానవజాతికి వందనీయులైన తల్లి, తండ్రి, గురువు, దైవం అన్న క్రమంలో కూడా తల్లి తర్వాతనే గురువు, దైవం వందనీయులన్న విషయాన్ని సూచిస్తూ తల్లికే ప్రధమ స్థానమివ్వటం జరిగింది.

**ఒక్కడుగా వున్న ఆ పరమాత్మ శ్రీ భరద్వాజ భగవానుడు తనలోని మాతృత్వానికి, ప్రేమ తత్త్వానికీ ప్రతిరూపంగా శ్రీ అలివేలుమంగమ్మ సహితుడై దివి నుండి భువికి దిగి వచ్చాడు.** ఇలా రెండు రూపాలలో మనలను పాలించవచ్చిన ఆ ప్రభువు, సీతారాములవలె మానవజాతికంతటికీ ఆదర్శ గృహస్థ జీవన విధానాలను తాము స్వయంగా ఆచరిస్తూమనకు తెలియజేసారు. ఆత్మతత్త్వంలో ఒక్కరే ఆయివుండి విశ్వ సృష్టి యజ్ఞంలో పరమాత్మలో సగభాగమై వెలుగొందుతున్న దివ్యజనని అలివేలుమంగమ్మగారి గురించి, ఆమె జీవిత విశేషాల గురించి యిక్కడ స్మరించు కొందాము.

ఆంధ్రదేశంలోని గుంటూరు జిల్లాలో పొన్నూరు పట్టణానికి మూడు కిలో మీటర్ల దూరంలో మన్నవ అనే గ్రామం వుంది. ఆ గ్రామం యోగులకు, మహా భక్తులకు, సదాచార సంపన్నులకు నిలయం. ఆ గ్రామంలో గొప్ప దాన ధర్మపరులుగా పేరుగాంచిన కుటుంబంలో శ్రీ మన్నవ బాలకృష్ణ శర్మ, శ్రీమతి రంగనాయకమ్మ అనే పుణ్య దంపతుల కుమార్తెయే శ్రీ భరద్వాజ మాస్టరుగారి ధర్మపత్ని, దివ్యజనని అలివేలుమంగ తాయారుగారు. చిన్ననాటి నుండీ ఆమెకు తల్లిదండ్రుల వార సత్వంగా దైవభక్తి అలవడింది. మన్నవ గ్రామవాస్తవ్యుడు మన్నవ సీతాపతిగారి కుమార్తె అయిన మహాయోగిని బ్రహ్మాండం అనసూయమ్మగారిపట్ల వీరి కుటుంబమంతా ఎంతో భక్తి ప్రపత్తులను కలిగి వుండేవారు. ఆమె వీరికి దగ్గర బంధువు, వరుసకు అత్త అవుతారు. బాపట్ల సమీపంలోని జిల్లెళ్ళమూడి గ్రామ కరణంగారైన శ్రీ బ్రహ్మాండం నాగేశ్వరరావుగారి సతీమణి అయిన అనసూయమ్మగారు, జిల్లెళ్ళమూడి అమ్మగా ప్రసిద్ధిగాంచిన మహాయోగిని. శ్రీ రాజరాజేశ్వరీ ఉపాసకురాలైన జిల్లెళ్ళమూడి అమ్మ ఎందరికో గురువై, ప్రజలను మోక్షపథగాముల్ని చేసి, అసంఖ్యాక భక్తుల హృదయాలలో ఆరాధ్య దైవంగా కొలువై నిలచింది.

ఇక్కడ మనం దివ్యజనని అలివేలుమంగా మాతకు, ఆమె బంధువు అయిన మహాయోగిని జిల్లెళ్ళమూడి అమ్మకు జన్మస్థానమైన మన్నవ గ్రామం గురించి మరికొన్ని ముఖ్యమైన అంశాలను ప్రస్తావించుకొనటం సముచితంగా తోస్తుంది.

తరతరాలుగా వందలాది సంవత్సరాలుగా మన్నవ గ్రామ ప్రాంతమంతా ఒక తపోభూమిగా విలసిల్లింది. ధర్మశీలతకు, సన్మార్గవర్తనకు మారుపేరుగా నిలచిన ఆ గ్రామంలో మాకు తెలిసిన రెండు మూడు తరాలలోని యీ గ్రామంలోని గొప్ప తపస్సంపన్నులైన మహనీయులను గ్రంథ విస్తార సమస్య వుండటం వలన కొందరిని మాత్రం స్మరించుకొందాం.-మన దివ్యజనని అలివేలుమంగ తాయారు గారి తల్లిగారైన రంగనాయకమ్మగారి తండ్రి మన్నవ గ్రామవాస్తవ్యులయిన పులిపాక శేషమ్మగారు మహాలక్ష్మీ ఉపాసకురాలై లక్ష్మీ సాక్షాత్కారాన్ని పొందిన భాగ్యశాలి. విచిత్రమేమంటే లక్ష్మీదేవి సాక్షాత్కారాన్ని పొందుతున్నప్పటికీ శేషమ్మగారు ఏనాడూ తనకు సిరిసంపదలను ప్రసాదించమని దేవిని కోరలేదు. ఆ మహాయోగిని తనకు భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను ప్రసాదించి ముక్తిపథంలో తనను నడిపించమని మనసారా ఆ దేవిని ప్రార్ధించేది. శ్రీ మహాలక్ష్మీ ఆమె కోరికను మన్నించి, ఆమెకు అనంత వైరాగ్యసంపదను ప్రసాదించటంతో ఆమె నిశ్చల తపోనిష్టతోను, భక్తి, జ్ఞాన, వైరాగ్య సంపన్నతతోను అలరారుతూ కాలాంతరంలో జ్ఞాన పరిపూర్ణురాలుగా రూపొందింది. శ్రీ మహాలక్ష్మీదేవి ఆమె తపోనిష్టకు మెచ్చి ఆమెకు నిత్య సాక్షాత్కారాన్నిస్తూ నిత్యమూ ఆ యోగమాతకు తన అనుగ్రహ సూచనగా రకరకాల ప్రసాదాలను అందించేది. అరటి ఆకులలో వేడి వేడి పాయసము, పులిహోర, అరిసెలు, పొంగలి వంటి అనేక రకాల ప్రసాదాలను లక్ష్మీదేవి ఆమె ముందుంచి అదృశ్యమయ్యేది. శ్రీమతి శేషమ్మగారు ఆ ప్రసాదాలను తన వద్దకు వచ్చే భక్తులందరికీ పంచేవారు. శ్రీమతి శేషమ్మగారు మన్నవ గ్రామంలోని స్త్రీలందరికీ గురువై మంత్ర దీక్షలను ప్రసాదించేవారు. నిత్యమూ మధ్యాహ్నా, సాయం వేళలలో స్త్రీలందరూ ఆమె యింటిలో సమావేశమై తమ గురువైన శ్రీమతి శేషమ్మగారి నుండి ఎంతో భక్తి ప్రపత్తులతో ఆధ్యాత్మిక బోధలను వినేవారు. వారి యిల్లు ఒక సత్సంగ మందిరంవలె భాసిల్లేది.

దివ్యజనని పెదతల్లిగారైన మన్నవ సత్యవతీదేవి 10

సంవత్సరాల వయస్సులో వున్నప్పుడు శ్రీ మహాలక్ష్మీదేవి ఆమెకు సాక్షాత్కారించింది. ఆ సాక్షాత్కారంలో దివ్యానుభూతికిలోనైన ఆ బాలిక ఆనాటి నుండి ఆజన్మాంతం నిరంతరం శ్రీ మహాలక్ష్మీ స్మరణలో మునిగి మహాభక్తురాలిగా ప్రసిద్ధి గాంచింది. విచిత్రమేమంటే శ్రీమతి సత్యవతీదేవి నిదురిస్తున్న సమయంలో కూడా ఆమె పెదవులు కదులుతుండేవి. ఆమె నోరు వద్ద చెవియొగ్గి వింటే, గాఢనిద్రలో వున్న ఆమె పెదవులు నుండి "శ్రీ మహాలక్ష్మీ" నామం స్పష్టంగా వినిపించేది.

దివ్యజనని తాతగారి అన్నదమ్ములలో ఒకరైన శ్రీ మన్నవ హనుమంతయ10్యగారు ఆంజనేయ సాక్షాత్కారాన్ని పొందిన మహాయోగి. ఆయనకు శ్రీ ఆంజనేయస్వామి వారి నిత్యసాక్షాత్కారం వుండేది. జిల్లెళ్ళమూడి అమ్మ తండ్రిగారైన మన్నవ సీతాపతిగారి సోదరి "మరిడమ్మ" గారు దైవానుగ్రహాన్ని సంపూర్ణంగా పొందిన తపస్విని. బాల వితంతువు అయిన యీమె నిరంతర యోగ నిష్ఠలో నిమగ్నురాలై జీవితాన్ని గడిపింది. ఆమె భగవన్నామము, దైవ సంబంధమైన సంభాషణలు తప్ప అన్య విషయాలు మాట్లాడటం ఎవ్వరూ వినియుండలేదు. ఆమె రాత్రింబవళ్ళూ దైవ సంకీర్తనలలో నిమగ్నమై వుండేది. ఇంటి పనులు చేసుకుంటూ వివిధరకాల వేదాంత గీతాలు, భక్తి గీతాలు శ్రావ్యంగా గానం చేస్తూవుండేది. **దివ్యజనని శ్రీ అలివేలుమంగ తాయారు మాతృదేవి శ్రీమతి రంగనాయకమ్మగారు చిన్ననాటి నుండి కోదండరామస్వామిని ఆరాధిస్తుండేవారు. కాలాంతరంలో ఆమెకు శ్రీ సాయిబాబా, శ్రీ అక్కల్‌కోట స్వామి, శ్రీ రమణ మహర్షి ప్రత్యక్ష సాక్షాత్కారాన్ని ప్రసాదించారు.** మన్నవ గ్రామంలో శ్రీ రాజరాజేశ్వరీ దేవి దేవాలయం వుంది. ఆ దేవాలయంలోని అమ్మవారు తనను భక్తితో ఆరాధించే గ్రామ ప్రజలకు పిలిస్తే పలుకుతూ, ఆపదలు నివారిస్తూ వరాలిచ్చే ఎంతో మహిమ గల దేవతయై గ్రామాన్ని పాలిస్తూండేది. గ్రామ పొలిమేరలలోని గ్రామదేవత "పోతురాజు స్వామి", గ్రామంలో ఏ వ్యాధులు, ఆపదలు రాబోతున్నా ప్రజలకు స్వప్నాలలో కనిపించి రాబోయే ప్రమాదాలను, వాటి నివారణలను వివరించి అనుక్షణం గ్రామాన్ని కాపాడుతుండేవారు. ఈ గ్రామ ప్రజలు సత్ప్రవర్తన, సాధుజనుల పట్ల భక్తి ప్రపత్తులు, దైవ చింతనలకు ముగ్ధులై ఎందరో మహనీయులు ఈ గ్రామాన్ని దర్శించి, గ్రామంలో కొద్ది రోజులుండి, గ్రామ ప్రజలను ఆశీర్వదించి వెళ్ళేవారు. ఎప్పుడూ, ఎక్కడా మూడు రాత్రులకంటే వుండని నియమంగల మహాత్ములు కూడా యీ గ్రామప్రజల భక్తికి మెచ్చి వారి ప్రార్థనపై గ్రామంలో స్థిరపడి పోయినవారు కూడా వున్నారు. అలాంటి వారిలో నాగండ్ల గ్రామస్థులైన ప్రతాపకోటయ్యగారు అనే మహాత్ములు ఒకరు. దివ్యజనని నాయనమ్మగారి వితరణశీలత ఎంతో కొనియాడదగినదని యీనాటికీ గ్రామ ప్రజలు స్మరించుకొంటూ వుంటారు. గ్రామంలోని పేద సాదలకు ఆమె పెన్నిధియై నిరంతర దానధర్మాలు చేస్తూ ఆమె జీవితాన్ని ధన్యత నొందించుకొనడమే గాక ధ్యానంలో చంద్ర దర్శనం కలిగిన భాగ్యశాలి. దివ్యజనని తండ్రి శ్రీ బాలకృష్ణ శర్మగారు రామనామ ప్రియులు, గొప్పకవి. తెలుగు ప్రజల సుపరిచిత మధురకవి, ఆంధ్రులకు అత్యంత ప్రియమై ప్రసిద్ధినొందిన పుష్పవిలాపగేయ రచయిత, శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు- వీరి మిత్రులు, సమకాలికులు. శ్రీ పాపయ్యశాస్త్రిగారు కవిత్వంలోని మెళుకువలను, కవితా రచనా విధానాలను మొట్టమొదటగా దివ్యజనని తండ్రిగారైన శర్మగారి వద్దనే నేర్చుకోవటం జరిగింది.

ఒకసారి శ్రీ బాలకృష్ణ శర్మగారు తీవ్ర వ్యాధిగ్రస్తులై వుండగా, జిల్లెళ్ళమూడి అమ్మ దివ్య తేజోమూర్తియై, స్వర్ణ కిరీటధారిణియై, రత్నాలంకరణ భూషితయై, బంగారు సింహాసనంపై కూర్చొని దర్శనమిచ్చి ఆశీర్వదించారు. ఆ మరునాడే శర్మగారి వ్యాధి నివారింపబడింది. ఈ అద్భుత మహిమకు దిగ్భ్రాంతి చెందిన శర్మగారు ఆమెపట్ల భక్తి పారవశ్య హృదయులై ఆమెను కీర్తిస్తూ ఎన్నో పద్యాలు వ్రాసారు.

ఇంకా ఎందరో మహనీయులు మన్నవ పుణ్యభూమిలో జన్మించారు. ఇటువంటి తపోభూమి శ్రీ అలివేలుమంగా మాత జన్మస్థలం కావటం గమనార్హం.

ఇక దివ్యజనని జీవిత విశేషాలను తెలుసుకొందాం.

**చిన్ననాటి నుండీ అలివేలుమంగామాత దైవచింతనపై ఎంతో ప్రీతిని కనపరచే వారు, ఆమె స్వభావం యింట్లోని పిల్లల కంటే విభిన్నంగా, విలక్షణంగా వుండేది.** ఆమె బాల్యంనుండీ కూడా ధీర గంభీర హృదయురాలై, ఎటువంటి పరిస్థితులకూ చలించక ఎంతో నిబ్బరంగా వ్యవహరించేవారు. ఆ కాలంలోని పిల్లలవలే ఆమె సరదాలు, విలాసాల పట్ల ఆసక్తి చూపించక నిర్లిప్తురాలై, ఆంతరంగంలో అందరిపైనా ప్రేమానురాగాలు కలిగి వుండేవారు. చిన్న వయసునుండే ఆమెకు యింటి పరిస్థితులు, కష్టసుఖాలు అవగతమై తల్లిదండ్రుల పట్ల, వారి సమస్యల పట్ల దృష్టి వుంచి వారిపై ఎంతో సానుభూతి వ్యక్తం చేసేవారు. సహజంగా కోప స్వభావులైన తండ్రిని అప్పుడప్పుడు కుటుంబసభ్యులు విమర్శిస్తుంటే ఎంతో చిన్న వయస్కురాలైన ఆమె ఆ విమర్శలను సహించక, "నాన్నగారు మనకోసం ఎంతో శ్రమిస్తున్నారు. ఆర్థిక యిబ్బందులను లెక్కచేయక శక్తికిమించి పిల్లలను చదివిస్తున్నారు. తాను

కష్టపడుతూ, మన భవిష్యత్తులకై, మన శ్రేయస్సుకై శ్రద్ధ వహిస్తున్నారు. ఆయన కోప స్వభావులైనా ఎంతో గొప్ప హృదయం కలవారు. ఆయన పట్ల కృతజ్ఞత, భక్తి కలిగి వుండాలి కానీ, ఆయనను విమర్శించటం తప్పు" అనేవారు ఎంతో బాధగా.

ఇంటికి వచ్చిపోయే బంధువులతో, పసిపిల్లలతో, పని ఒత్తిడి ఎక్కువై తల్లి ఎంతో కష్టపడుతూ వుంటే అంత చిన్న వయస్సులోనే ఆమె హృదయం బాధతో తీవ్రంగా స్పందించేది. పెద్దవారైన తర్వాత ఆమె అప్పుడప్పుడూ ఆ సన్నివేశాలను తలచుకొంటూ యిలా చెపుతుంటారు, "అమ్మ చాలా బలహీనంగా వుండేది. డాక్టర్లు ఆమెకు ఒంట్లో రక్తం చాలా తక్కువగా వున్నదని, ఆమె మంచి ఆహారం తీసుకోవాలనీ, విశ్రాంతి అవసరమనీ చెప్పేవారు. కానీ ఆమెకు యింట్లోపని ఒత్తిడి చాలా ఎక్కువగా వుండేది. పని చేసుకోలేక బాగా నీరసించేది. అమ్మకు పనిలో సహాయపడాలని ఎంతగానో అనిపించేది. కానీ నేను అప్పుడు చాలా చిన్న పిల్లను కావటం

**వయసుతో పాటు శ్రీ అలివేలు మంగమ్మగారికి చదువు సంస్కారమే కాక దైవ చింతనకూడా వృద్ధి చెందసాగింది.**

వలన ఆమెకు ఏమీ సహాయం చేయలేక బాధతో చూస్తూ వుండేదాన్ని. అమ్మను చూస్తుంటే నాకెంతో దిగులు వేసేది" అనేవారు.

శ్రీ అలివేలుమంగమ్మ 4,5 సంవత్సరాల వయసులో జరిగిన ఒక సన్నివేశం ఆమె సున్నిత హృదయాన్ని తెలియపరుస్తుంది. ఆమె అక్క మరికొందరు పిల్లలతో కలసి వారింటికి దూరంగా వున్న పాఠశాలకు వెళ్తుండేవాళ్ళు. ఆ పాఠశాలకు వెళ్ళాలంటే, దారి మధ్యలో వున్న రైలు పట్టాలను దాటి వెళ్ళాలి. శ్రీ అలివేలుమంగమ్మకు అప్పటికింకా అక్షరాభ్యాసం అవనందువలన ఆమె అక్క ముద్దుగా అప్పుడప్పుడూ చెల్లెలిని తనతో స్కూలుకు తీసుకువెళ్తుండేది. అయితే స్కూలు నుండి యింటికి రాగానే ఆ రోజంతా తన చెల్లెలు దిగులుగా వుండటం చూసి కారణం అడిగితే ఏమీ మాట్లాడేదికాదు. ఒకరోజు ఆమె అక్క తోటి పిల్లలతో కలిసి స్కూలుకు వెళ్ళిపోయింది. ఉన్నట్లుండి శ్రీ అలివేలుమంగమ్మ పెద్దగా వెక్కివెక్కి ఏడవటం మొదలు పెట్టింది. తల్లి కంగారుగా పిల్లను ఎత్తుకుని "ఎందుకేడుస్తున్నావు? ఏమైంది?" అని అడిగితే "అక్కావాళ్ళు స్కూలుకు వెళ్ళేటప్పుడు రైలు పట్టాలు వస్తాయి కదా. పట్టాలు దాటేటప్పుడు రైలు వాళ్ళ మీదకు వచ్చేస్తుందేమో!" అంటూ ఏడవ సాగింది. అట్లా ఏమీ జరగదని, రైలు పెద్ద కూతవేస్తూ వస్తుందనీ, ఆ కూత విని పిల్లలు రైలు వెళ్ళిపోయిన తర్వాతనే పట్టాలు దాటుతారనీ ఏమీ భయం లేదనీ తల్లి ఓదార్చింది. భగవదంశతో పుట్టిన బిడ్డ అవటం వలననేమో తల్లికి యీ పిల్లపై ప్రత్యేక అభిమానం వుండేది. "ఈ పిల్లపై నాకు ఎంతో జాలిగా వుండేది. ఏమీ అల్లరి చేయదు. ఏది కావాలని పేచీ పెట్టదు. ఆకలివేసినా ఏమీ పెట్టమని అడగదు. అందుకే యీ పిల్లమీద నేను ఎక్కువ శ్రద్ధ తీసుకునేదాన్ని"అనేవారామె.

గుంటూరులోని కొత్తపేటలో నివసించే శ్రీ అలివేలు మంగమ్మగారి యింటికి దగ్గరగా వుండే ఒక వీధిలో ఒక సాయిబాబా భక్తురాలు వుండేవారు ఆమె యింటిలోని ప్రతి గురువారం జరిగే పూజ, భజన కార్యక్రమానికి ఆ పరిసరాలలోని ప్రజలందరూ వెళ్ళేవారు. ప్రతి గురువారంనాడు పూజకు హాజరయ్యే భక్తులలో ఎవరో ఒంటిపైకి శ్రీ సాయిబాబా ఆవహించటం జరిగేదని, ఆ సమయంలో శ్రీ సాయిబాబా తాను ఆవహించిన వ్యక్తి ద్వారా భక్తులతో సంభాషించి, వారి కష్టాలను నెరవేర్చటము, కోరికలను అనుగ్రహించటం చేస్తారని అందరూ చెప్పుకునేవారు. ఒక గురువారం శ్రీ అలివేలు మంగమ్మగారు స్నేహితులతో కలసి అక్కడకు వెళ్ళి వారింటిలో వున్న చాలా పెద్ద సైజు సాయిబాబా ఫోటో ముందు నిలబడ్డారు. **అప్పటికి ఆమె వయస్సు 13 సం॥లు. బాబా కళ్ళల్లోకి చూస్తున్న కొద్ది క్షణాలలోనే ఆమె శరీరమంతా చాలా బరువెక్కి క్రమంగా బాహ్యస్మృతిని కోల్పోసాగారు చిన్నపిల్ల అయిన ఆమె తనలోని ఆ మార్పుకు పూనకం వస్తున్నదని భయపడి వెంటనే యింటికి వచ్చేసారు. చిన్న వయసులోనే శ్రీసాయినాథుడు ఆమెకు యిటువంటి దివ్యానుభూతిని అనుగ్రహించారు.**

వయసుతో పాటు శ్రీ అలివేలు మంగమ్మగారికి చదువు సంస్కారమే కాక దైవ చింతనకూడా వృద్ధి చెందసాగింది. ఆమె తల్లిదండ్రులు అన్న వదినలు, బంధువులు తరుచు జిల్లెళ్ళమూడి అమ్మను దర్శిస్తుండేవారు. జిల్లెళ్ళమూడి అమ్మ వీరి దగ్గరి బంధువు అవటం వలన వీరి కుటుంబానికి జిల్లెళ్ళమూడి అమ్మ కుటుంబానికి సన్నిహిత సంబంధాలుండేవి. జిల్లెళ్ళమూడి అమ్మకు యిద్దరు కుమారులు, ఒక కుమార్తె వుండేవారు. వారు అప్పుడప్పుడు

మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.

పేరింటికి వస్తుండేవారు. **ఇంట్లో ఎప్పుడూ దైవ సంభాషణలు, జిల్లెళ్ళమూడి అమ్మ గురించిన విషయాలు, విశేషాలు మాట్లాడుకొంటుండటం వలన శ్రీ అలివేలుమంగమ్మ గారికి జిల్లెళ్ళమూడి అమ్మపట్ల ఎంతో భక్తి ప్రపత్తులు ఏర్పడ్డాయి. ఆమె నిరంతరం అమ్మ నామస్మరణ జపిస్తుండేవారు.**

18 సంవత్సరాల వయసులో శ్రీ అలివేలుమంగమ్మ గారు తమ కుటుంబ సభ్యులతో కలసి జిల్లెళ్ళమూడి వెళ్ళారు. అక్కడ అమ్మ సన్నిధిలో నాలుగు రోజులున్న తర్వాత అందరూ గుంటూరుకు తిరుగు ప్రయాణమయ్యారు అయితే శ్రీ అలివేలు మంగమ్మగారు మాత్రం తాను జిల్లెళ్ళమూడి అమ్మ సన్నిధిలో వుంటానని చెప్పి వుండిపోయారు.

ఒక నెల రెండు నెలలు కాలం గడిచిపోయింది. జిల్లెళ్ళమూడిలో శ్రీ అలివేలుమంగమ్మ ఎంతో భక్తి ప్రపత్తులతో అమ్మను సేవించుకొంటూ ఎంతో ఆనందంగా రోజులు గడుపుతున్నారు. కానీ తల్లిదండ్రులు ఆమె గురించి బెంగపడసాగారు. ముఖ్యంగా తల్లి బిడ్డను వదలి వుండలేక పిల్లను యింటికి తీసుకురావలసిందిగా భర్తను జిల్లెళ్ళమూడి పంపింది. తనను యింటికి తీసుకు రమ్మని పిలిచిన తండ్రితో తాను యింటికిరానని అమ్మను వదలి రాలేనని దు:ఖించారు శ్రీ అలివేలుమంగమ్మ గారు. ఆ దు:ఖం చూడలేక ఆమె తండ్రి ఆమెను అమ్మ సన్నిధిలోనే వదలి ఒక్కరే యింటికి వచ్చేసారు. ఈ విధంగా చాలాసార్లు తల్లిదండ్రులు ఆమెను యింటికి తీసుకురావాలని తీవ్రయత్నం చేశారు. కానీ, ఆమె అమ్మను వదలి రానని దు:ఖిస్తుంటే వాళ్ళు పిల్లను తమ వద్దకు రమ్మని బలవంత పెట్టలేకపోయారు. **భక్తి మార్గంలో వున్న ఆమెను శ్రీ జిల్లెళ్ళమూడి అమ్మయే కాపాడగలదని, ఆమె సన్నిధిలో తన బిడ్డ సురక్షితంగా వుంటుందని నమ్మిన ఆ మహా భక్తురాలు , సంస్కారవంతురాలు అయిన ఆ తల్లి తన మనసును సమాధానపరచుకొని మిన్నకుండిపోయేది.** ఆ తర్వాత కొంతకాలానికి ఆమె తండ్రి దివంగతులయ్యారు. ఆ సందర్భంగా ఆమెకు కన్నతండ్రిని కడసారి చూపించే నిమిత్తం ఆమె బంధువులు జిల్లెళ్ళమూడి వచ్చారు.

వారు జిల్లెళ్ళమూడి అమ్మతో విషయం చెప్పారు. ఆ మాట వినగానే శ్రీ అలివేలు మంగమ్మగారు దు:ఖించసాగారు. ప్రక్కనున్నవాళ్ళు ఎంతో బాధతో ఆమెతో "ప్రతి వారికీ ఏదో ఒకనాడు తల్లిదండ్రుల వియోగం తప్పదు కదా! నీవు అలా దు:ఖిస్తే మీ నాన్నగారి ఆత్మకు శాంతి వుండదు. నిగ్రహించుకోవాలి" అని ఓదార్చ యత్నించారు. అయితే ఆమె, "నేను మా నాన్నగారు మరణించారని దు:ఖించటం లేదు. నాన్న ఎక్కడికీ పోలేదు. నా తండ్రి ఆత్మ అమ్మ పాదాల చెంతకే చేరి వుంటుంది. అయితే అమ్మను విడిచి వెళ్ళాలంటే బాధగావున్నది. నేను అమ్మ సన్నిధిని వీడి ఒక్క నిమిషమైనా వుండలేను. నేను వెళ్ళను" అని ఆమె ఏడుస్తుంటే అంతా నివ్వెరపోయి చూస్తుండిపోయారు. అపుడు అమ్మ ఆమెను ఓదార్చి, "నీ తండ్రి నీకు యిక ఎప్పటికీ కన్పించరు కనుక యిప్పుడు వెళ్ళి నువ్వు ఆయనను చివరిసారిగా దర్శించి, నమస్కరించుకొనటం నీ ధర్మం. కనుక ఆయన అంతిమ సంస్కారాలకు హాజరై వెంటనే తిరిగి నా వద్దకు వచ్చేయి" అని నచ్చచెప్పి మన్నవ గ్రామానికి పంపారు అమ్మ. ఆమె చెప్పిన విధంగానే తండ్రి అంతిమ సంస్కారాలు ముగిసిన వెంటనే జిల్లెళ్ళమూడి తిరిగి వచ్చేసారు శ్రీ అలివేలు మంగమ్మ. ఆ తర్వాత కొంతకాలనికి ఆమె ఆరోగ్యం క్షీణించటంతో విశ్రాంతి నిమిత్తం జిల్లెళ్ళమూడి అమ్మ ఆమెను ఎలాగో సమాధానపరచి వారి యింటికి పంపించారు. అమ్మ ఆదేశం కనుక అయిష్టంగానే ఆమె బనగానపల్లెలోని తమ గృహానికి తిరిగి వచ్చారు. ఆ సన్నివేశాన్ని గురించి **శ్రీ అలివేలు మంగమ్మగారు యిలా చెపుతుంటారు: "అమ్మ సన్నిధి వీడి బ్రతకలేననిపించేది. అలా జరిగితే నాకీ జీవితం ఎందుకు? అనుకునేదాన్ని. ఆ ఊహనే భరించలేకపోయేదాన్ని. ఒకవేళ అలా జరిగినట్లయితే నాకు మరణమే గతి. ఆత్మహత్య శరణ్యం అని కూడా అనిపించేది" అంటారామె.**

దివ్యజనని శ్రీ అలివేలుమంగమ్మ 'ఎంతో బాగా పాడతారు' అన్న విషయం యిప్పటి వారికి ఎవరికీ తెలియదు. ఆమె జిల్లెళ్ళమూడిలో వుండగా ఎన్నో భజన కీర్తనలు, భక్తి గీతాలు పాడేవారు. ఒకసారి ఆమె, మరికొందరు భక్తులు కలసి సంకీర్తన చేస్తున్నప్పుడు జిల్లెళ్ళమూడి అమ్మగారి భర్తగారైన బ్రహ్మాండం నాగేశ్వరరావుగారు, "ఈ సంకీర్తనలో అందరూ కలసి సంకీర్తన చేస్తున్నా మంగ కంఠస్వరం ఎంతో ప్రత్యేకంగా, శ్రావ్యంగా వినిపిస్తుంది. ఆ స్వరంలో ఎంతో

తనను యింటికి తీసుకు రమ్మని పిలిచిన తండ్రితో తాను యింటికిరానని అమ్మను వదలి రాలేనని దు:ఖించారు శ్రీ అలివేలుమంగమ్మ గారు. ఆ దు:ఖం చూడలేక ఆమె తండ్రి ఆమెను అమ్మ సన్నిధిలోనే వదలి ఒక్కరే యింటికి వచ్చేసారు.

మాధుర్యం వున్నది" అని ఎంతో మెచ్చుకుంటుంటే, ఆ సమయంలో అక్కడే వున్న నేను (రచయిత్రి) " అవును! మా మంగక్క చాలా బాగా పాడుతుంది" అన్నాను. అలా అమె తన మధురగానంతో అందరినీ పరవశింపజేసేవారు.

**అయితే జిల్లెళ్ళమూడిలో ఆమె గడిపిన ఆరు సంవత్సరాలకాలం ఆమె ఆ సన్నిధి భాగ్యాన్ని పూర్తిగా అనుభవించారు. పరిపూర్ణంగా అమ్మను సేవించుకొన్నారు.** నిజం చెప్పాలంటే సుకుమారులైన తన పిల్లల సున్నితమైన చేతులు కందిపోతాయని ఆ తల్లి ( శ్రీమతి రంగనాయకమ్మగారు) పిల్లలకు యింటి పనులేవీ చెప్పక అన్ని పనులూ తానే చేసుకొనేవారు. "మీరు యింట్లో ఏమీ పనులు చెయ్యవద్దు. పూర్తి సమయం చదువుకే వినియోగించాలి. మీరెప్పుడూ చేతిలో పుస్తకంతోనే నాకు కనిపించాలి. పనులన్నీ మీ అమ్మ చూసుకుంటుంది. మీరు బాగా పెద్ద చదువులు చదవాలి" అంటూ తండ్రి ఎప్పుడైనా పనులు చేస్తుంటే చూసి పిల్లలను తీవ్రంగా మందలించేవారు. పని పాటలు కూడా ఎరుగక ఎంతో గారాబంగా పెరిగిన ఆ బిడ్డ జిల్లెళ్ళమూడిలో చేసిన సేవ అనుపమానం. **'అమ్మసేవ' అంటే చాలు ఎలాంటి పనికైనా సిద్ధపడేవారామె. చెరువునుండి బిందెలు భుజానపెట్టుకుని నీళ్ళు తీసుకురావటం, పొలం పనులు. గృహనిర్మాణ పనులు, అమ్మ పుట్టినరోజు, పండుగదినాలలో ఆవరణలో పందిళ్ళు వేసి తోరణాలు కట్టడం, వచ్చే భక్తులకు సదుపాయాలు చేయటం, వడ్డన చేయటంవంటి మొ॥న అనేక రకాలైన పనులు చేసేవారు.** వాస్తవంగా ఆమె పచ్చని శరీరచ్ఛాయతో, పొడవైన జడతో ఎంతో అందంగా నాజూకుగా వుండేవారు. శక్తినిమించిన శ్రమ వలన సున్నితమైన ఆమె శరీరం శుష్కించిపోయింది. పచ్చని దేహచ్ఛాయ కమిలి, కందిపోయి ఎరుపు, నలుపు మిశ్రమ వర్ణంలోకి మారిపోయింది. పొడవైన ఆమె కురులు పూర్తిగా రాలిపోయాయి. నల్లగా వుండే తల వెంట్రుకలు ఎరుపు రంగులో మారిపోయాయి. ఆశ్రమానికి ఆస్థులు, విరాళాలు అప్పట్లో చాలా పరిమితంగా వుండటంతో నిర్వాహకులు ఆశ్రమవాసులకు మంచి పోషకాహారం అందించలేకపోయారు. ఏళ్ళ తరబడి కనీస పోషకాహారం కూడా లేక ఆమె చిక్కిశల్యమైపోయారు. ఎంతగా సన్నబడిపోయారంటే ఆమె శరీరం శుష్కించి అస్థిపంజరంవలె తయారైంది. అయినా ఆమెలో అణుమాత్రమైనా అసంతృప్తి లేదు.

ఇక్కడ మనం గమనించవలసిన విషయమేమంటే, దివ్యజనని అలివేలుమంగమ్మ అకుంఠిత దీక్ష, భక్తితత్పరత ఆమె జిల్లెళ్ళమూడి ఆశ్రమవాసంలో గడిపిన తీరు తెన్నులలో తేటతెల్లమౌతుంది. ఆమెకు తన యింటివద్ద లభించే సౌకర్యాలు, సంతోషాలు, ఆహార విహారాలు, తల్లిదండ్రుల, తోబుట్టువుల ప్రేమానురాగాలు యివేవీ తను అపారంగా ప్రేమించిన 'అమ్మ' సన్నిధికి సరిసాటి కాలేకపోయాయి. ఆ వయసులో వుండే యువతులు కోరే కనీస కోరికలు, వివాహంపై, శరీరాలంకరణపై యీమెకు ఏ మాత్రం అనురక్తి లేకపోవటం ఎంత ఆశ్చర్యం! వివాహ వయస్కులైన ఆడపిల్లలు అందరికీ అందంగా కనపడాలనే తపన సహజమైన ఆ కోర్కెను మించి, అందచందాలు నశించి, శరీరం శుష్కించి వికృతంగా కూడా తయారైనప్పటికీ ఆమెకు ఆ విషయం గురించి ఏ మాత్రమూ దృష్టి లేకుండటం అనేది సామాన్యమైన విషయం కాదు. అప్పటికే ఆమె శరీర భ్రాంతిని వీడి అంతర్యంలో భక్తి, జ్ఞాన, వైరాగ్యాలను పరిపూర్ణంగా పొందివున్నారని అప్పటి ఆమె వైఖరి మనకు స్పష్టపరుస్తుంది. అంతేకాదు, ఆమె శరీరారోగ్యం కూడా పూర్తిగా దెబ్బతిన్నా, ఆమెకు తన ఆరోగ్యంపై కూడా ఏ మాత్రం దృష్టి లేకుండటం అసాధారణమైన విషయం. అమ్మపై ఆమె అంకిత భావం గురుచరిత్రలోని దీపకుని తలపిస్తుంది. జిల్లెళ్ళమూడిలో ఆశ్రమవాసులందరి హృదయాలలో ఆమె ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. **ఆమె జిల్లెళ్ళమూడి ఆశ్రమవాసం ఆమెను భగవచ్చింతనలో, కఠిన సేవా తత్పరతతో ఆమె హృదయాన్ని తప్తంచేసి, ఆమెకు భక్తి, జ్ఞాన, వైరాగ్యాలనే దివ్య సంపదలనిచ్చి సత్కరించింది.**

**దివ్యజనని అలివేలుమంగమ్మ అకుంఠిత దీక్ష, భక్తితత్పరత ఆమె జిల్లెళ్ళమూడి ఆశ్రమవాసంలో గడిపిన తీరు తెన్నులలో తేటతెల్లమౌతుంది.**

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ గురుదేవుల ధర్మపత్ని, మనందరికీ గురుపత్ని అయిన దివ్యజనని అలివేలు మంగమ్మతల్లి జన్మదినం oct 1st (oct 2nd తిధుల ప్రకారం) సందర్భంగా వారి చల్లని దీవెన మనందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ప్రార్థన.

మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.

# శ్రీ భరద్వాజ రచనామృతం





**గురుసేవా గయా ప్రోక్తా దేహః స్యాదక్షయోవటః ।**
**తత్పదం విష్ణుపాదంస్యాత్ తత్ర దత్తమనంతకం ॥**

గురువు యొక్క దేహం వటవృక్షమని చెప్పబడినది. (సృష్టి భగవద్గీతలో 'అశ్వత్థము లేక రావిచెట్టుగా చెప్పబడినది. అది అకులు, కొమ్మలు చిగుర్చుట వలన వృద్ధి పొందవలసినదే. అన్ని వృక్షములవలెనే అదీ జననమరణాలు కలది; సృష్టి ఆద్యాంతాలు కలది గనుక.) వటవృక్షం నాశనంలేనిది. మొదలు నశించినా ఊడలు మొదళ్ళుగా అయి కొమ్మలను వృక్షలుగా జీవింప చేయగలవు. అంటే ఒక చెట్టు ఇన్ని చెట్ల రూపంలో నిత్యం విలసిల్లుతూంటుంది. అలానే సద్గురువు కూడా అర్హులైన శిష్యులను తనంతటివారుగా చేసుకొని("ఆత్మతుల్యాన్ కరోతి"; చింతామణి, కామధేనువులు, కల్పవృక్షం, స్పర్శవేదులలా కాక గురువు శిష్యుని తనవంటివాడుగా చేస్తాడని గురుచరిత్ర). అప్పుడు గురు శిష్యులు ఏకమైయుంటారు ఆంతర్యంలో. అందుకే అక్కల్‌కొట స్వామి తన శిష్యులనుగ్రహించేప్పుడు "నేనే నీలొకొస్తానుగదా!" అంటూనే సమాధిస్థితినను(గ్రహిస్తారు. తరువాత ఆ గురువు తన భౌతిక దేహాన్ని వీడినా ఈ సమర్థులైన శిష్యుల రూపంలో తానే విరాజిల్లుతాడు. కనుక వటవృక్షం. అందుకే అక్కల్‌కొట స్వామిని "మీరెవరు?" అనెవరో అడిగితే "వటవృక్షం; మూలానికి మూలం; దత్తనగరం" అన్నారు. ఏను తన శిష్యులతో "మిమ్ములనెవరంగీకరిస్తారో వారు నన్నంగీకరిస్తారు" అంటారు.

ఈ వటవృక్ష సామ్యాన్ని దృష్టిలో వుంచుకునే శ్రీ శంకరులు దక్షిణామూర్తి సోత్రంలో "వటవిటపి సమీపే..." అని వ్రాస్తారు.

ఈ ఆధ్యాత్మిక స్ఫూర్తినే ఈ శ్లోకంలోని "అక్షయో" అన్న విశేషణం సూచించేది.

నిత్యము, అక్షయము అయిన వటవృక్షం తిరిగి తిరిగి ఊడల రూపంలో పరంపరగా ఉపాధులను ధరిస్తూ తన వటతత్వాన్ని కోల్పోకుంటుంది. అంటే తన పరబ్రహ్మతత్వాన్నుంచి కొంచెమైనా జారని దివ్యశక్తి పరిమిత మానవ దేహాన్ని సద్గురువుగా ధరించడానికి సంకేతం.

# పూర్వకర్మ–మహనీయుల కృప

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

మన జీవితంలో అన్నీ పూర్వకర్మననుసరించే జరుగుతాయన్నది నిజమే అయితే సాయివంటి మహనీయులు ఆపదలనుండి భక్తులను రక్షించడమన్నది ఎలా సాధ్యం? అని ఎందరో పాఠకులు అడుగుతున్నారు.

సృష్టి తత్త్వము, అందులో భాగమైన జీవితము గూడ వాస్తవానికి అనిర్వచనీయములే - అంటే "ఇట్టివి" అని నిర్వచించి చెప్పడానికి వీలులేనివే. నేటి భౌతికశాస్త్రం కూడా ఇలానే చెబుతుంది. పదార్థమంతటికీ మూలమైనవిగా తలచబడే సూక్ష్మ కణాలుగూడా నిజానికి తరంగాలో, లేక కణాలో నిశ్చయించడం సాధ్యం కాదట. అంటే అవి తరంగాలుగానూ, కణాలుగానూ కూడా ప్రకటంకాగల మరొక అనిర్వచనీయమైన తత్త్వమన్నమాట. ఈ ద్వయీ భావము , అనిశ్చితతలు సృష్టి అంతటికీ మూలమని విజ్ఞాన శాస్త్రం చెబుతోంది. మనకు జడంగా తోచే పదార్థ తత్త్వమే ఇలాంటిదైతే చైతన్యంతో కూడి వున్న జీవుల సంగతి వేరే చెప్పాలా? అలానే జీవితం గూడా నిర్ణీతము, అనిర్ణీతము కూడా. స్థూలంగా చూస్తే జీవితంలో ఎక్కువ భాగం నిర్ణీతమే. దానిని నిర్ణయించేది కర్మసూత్రం. **కానీ కర్మ సిద్ధాంతం ఏమి చెబుతోంది? సరియైన అవగాహనతో జీవిస్తూ తనను కర్మకు బంధించే రాగద్వేషాల పాశంనుండీ విడువడే ప్రయత్నంచేసేందుకు మాత్రం మనిషికి స్వాతంత్ర్యం వున్నది.** అంత మేరకు జీవితం అనిశ్చితం. అతడి ప్రయత్నం యొక్క తీవ్రతను బట్టీ, దక్షతను బట్టీ అట్టి ఫలితం వేరు వేరు వ్యక్తులకు వేరుగా వుంటుంది.

ఒక పక్షవాత రోగిని కొందరు సేవకులు ఎత్తుకుని తెచ్చి రమణమహర్షి ఎదుట కూర్చోబెట్టారు. మహర్షి అతడికేసి తదేకంగా కొంతసేపు చూచారు. అతడు అద్భుతరీతిన లేచి ఆయనకు నమస్కరించి తన వద్దనున్న ఒక కాగితం తీసి వారికి చూపాడు. దాంట్లో- ఒక జ్ఞాని యొక్క కృపవలన అతడికి ఆరోగ్యం చక్కబడగలదు- అని అతడి జాతకంలో వ్రాసి వున్నదట. అంటే అతడు పూర్వం చేసుకున్న మహాత్ముల సేవయే ఆనాడు నిర్ణీత ఫలితం ఇచ్చింది. అయినప్పటికీ ప్రస్తుత ఫలితానికి కారణమైన పూర్వపు సద్గురు సేవ దానికి యెంత కారణమో, మహర్షి అంతే కారణం.

<u>Annadhanam List</u> :-

| | | |
|---|---|---|
| 1. P.V. Krishnam Raju | Vijayawada | 1343-00 |
| 2. D. Subrahmanyam | Punganuru | 1343-00 |
| 3. Sri Krishna Chaitanya | Rajahmundry | 1343-00 |
| 4. K.V. Vijayalakshmi | Hyderabad | 1343-00 |
| 5. C.Suneetha | Bangalore | 1500-00 |
| 6. M. Naga Raju | Bangalore | 1343-00 |

<u>General Donation List</u> :-

| | | |
|---|---|---|
| 1. R. Sulochana Devi | Karimnagar | 500-00 |

# శ్రీశ్రీశ్రీ రంగన్న బాబుగారు

చూడటానికి కూలివానిలాగా ఒక కొల్లాయి ధోవతి, పై పంచె మాత్రమే ధరించి, అమాయకంగా, మర్యాదగా అందరితో మాట్లాడుతూ, చేతి సంచిలోని ప్రసాదాలనందరు భక్తుల యిండ్లకు కాలినడకన తిరిగి పంచుతూనో, ఉరిలోని ఆలయాలు తిరుగుతూనో కన్పిస్తారు సాధారణంగా బాబుగారు. సామాన్యంగా బాబుగారు వాహనం ఎక్కేవారు కారు. **ఆ నిరాడంబరతకు బోసినోరు వికసించేలా నవ్వేనవ్వులు, ఎక్కడో మరోలోకం చూస్తూ వెరిసే చూపు ఆయనకు పెట్టని ఆభరణాలు. సామాన్యంగా ఎవరేమి యిచ్చినా పుచ్చుకోరు. వారికి సంతకం చెయ్యటంకూడా రాదు. డబ్బు ఎవరైనా లెక్కపెట్టి చెప్పాల్సిందే. చివరి వరకూ నీళ్ళకావడిమోసి జీవించారు.** నీళ్ళుపోసే వారింట్లో ఒకవ్యక్తిగా కలసిపోయేవారు. చిన్నపిల్లలతో ఒక్కరై ఆడుకోనేవారు.

వీరి జీవితం యావత్తూ అధిక భాగం ఏలూరు, గుంటూరు, చీరాల, తిరిగి గుంటూరు, ఆపైన అవసానదశ ఏలూరులో తన సంతానం వద్ద గడిచిపోయింది.

శ్రీశ్రీశ్రీ రంగన్న బాబుగారు సాధారణ వైశ్యులు. బూర్లెవారి వంశమునందు జన్మించిరి. వీరిది ప్రకాశం జిల్లాలోని రామభద్రాపురము. తండ్రి పుల్లయ్యగారు. తల్లి జగదాంబ. తండ్రిగారికి సరియైన ఉపాధి లేకపోవుట వలన బాబుగారి 1సం॥ వయస్సులో కుటుంబము ఏలూరు తరలివచ్చిరి. పుల్లయ్యగారు ప్రముఖ జమీందారులు అయిన మోతే నారాయణరావుగారి జూట్ మిల్లులో పాత గోతాలు కుట్టుతూ వుండేవారు. ఆ రోజులలో వీరికి రోజుకి ఒక కానీ తెలుసుకొనలేకపోయిరి.

నిజానికి ఆ పనివాడు నమ్మకంగా రంగన్నను హరిద్వార్, హృషీకేశ్, బ్రదరీనాథ్ మొ॥కొని రామేశ్వరం వరకూ యాత్ర చేయించాడు. వారు అలహాబాదు చేరేసరికి కుంభమేళా జరుగుతున్నది.

అసంఖ్యాకంగా భక్తులు, ఎందరో యోగులు అక్కడచేరి యున్నారు. ఒకనాడు, ఎందరో తపస్వులు ఊరేగింపుగా మేళాలో పోతువున్నారు. వారిలో దిగంబరి, ఆజానుబాహువు, జటాధారి అయిన సాధువు వీరి వద్ద నిలబడి, రంగన్నకేసి తదేకంగా చూసి మౌనంగా సాగిపోయారు. ఒక సంవత్సరంలోగా యింటినుంచి తెచ్చిన పైకం అయిపోయింది అటుపైన నాలుగు సంవత్సరాలు పాటు టిక్కెట్టు లేకుండా వీరిద్దరూ యాత్రలు సాగించారు. ఆ తర్వాత రంగన్నను ఏలూరులో వారింటి వాకిటవిడచి ఆ కూలీ వెళ్ళిపోయాడు. ఇంట్లో అందరూ ఎంతో ఆనందించారు.

పన్నెండు సంవత్సరాలు నిండినా రంగన్న వైఖరిలో మార్పులేదు. సాటి పిల్లలకు తన కండపుష్టిని ప్రదర్శించటం, బరువులను పళ్ళతో పైకెత్తటం, కాలువలో ఈతలు కొట్టటంతో కాలం గడించింది. తిరిగి వెనుకటి వృత్తినే అవలంబించి నెలకు రూ. 3 సంపాయించేవారు. ఒకనాడు ఒక పౌరాణికుడు కథ చెపుతూ ధృడ విశ్వాసంతో ప్రార్ధిస్తే శ్రీరామ దర్శన మౌతుందని నొక్కి చెప్పాడు. ఇంటికొచ్చిన రంగన్న 2,3 గం॥లు తీవ్రంగా యత్నించి నిరాశచెందిన క్షణంలో రామదర్శనమైంది. నాటినుంచి రంగన్న నిత్యమూ కాలువలో స్నానంచేసి చెట్టుక్రింద ఏకాంతంగా జపధ్యానాలు చేసేవాడు.

**ఒకనాడు ఒక పౌరాణికుడు కథ చెపుతూ ధృడ విశ్వాసంతో ప్రార్ధిస్తే శ్రీరామ దర్శన మౌతుందని నొక్కి చెప్పాడు. ఇంటికొచ్చిన రంగన్న 2,3 గం॥లు తీవ్రంగా యత్నించి నిరాశచెందిన క్షణంలో రామదర్శనమైంది.**

భత్యము లభించేదట. శ్రీ బాబుగారి 5వయేట తల్లిగారు మరణించగా వారి అక్కగారు పెంచినారు. ఈ విధముగా కొంతకాలము తండ్రిగారు కష్టపడి బాబుగారి సోదరి వివాహ నిమిత్తము దాచిన రూ. 1600/- ఒక జాజిచెక్కపెట్టలో పెట్టిరి. బాబుగారు రోడ్లమీద ఆడుకొను సమయంలో ఎవరో గుర్తుతెలియని వ్యక్తి బాబుగారి చేతిలో కలకండయుంచి మాటలుచెప్పి ఆకర్షించుకొని సోదరి వివాహ నిమిత్తము దాచిన రూ. 1600/- తీసుకురమ్మని యిద్దరూ కలసి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయిరి. ఎంత వెదికిననూ వారిజాడ

ఏలూరులో ప్రతి ఉదయం, సాయంత్రం శ్రీ దుగ్గిరాల మహాలక్ష్మమ్మగారింటివద్ద వున్న రామాలయంలో బాబుగారు మిగతా భక్తులూ కలసి సత్సంగం, భజన పూజలు జరిపేవారు. శ్రీ దేవులపల్లి కృష్ణమూర్తిగారనే ఉపాధ్యాయుని సతీమణి రోజూ వెళ్ళేవారు. ఒకరోజు బాబుగారు ఆమెతో "అమ్మగారు! ఆయన గారిని పిలవండి. రాములవారి ఆజ్ఞ అయినది" అని కృష్ణమూర్తిగారిని ఆలయంలోనికి పిలిపించారు. అప్పటినుంచి వీరు బాబుగారిని నిత్యం కలిసేవారు. బాబుగారి అనుగ్రహంతో వీరికి కలిగిన అనుభూతులను వ్రాసి

వుంచుకున్నారు. కానీ బాబుగారు తామున్నంత కాలము వాటిని బయటికి రానీయలేదు. పరిచయం కలిగిన మొదటి రోజులలోనే బాబుగారు రాములవారు విూకేదో యిస్తున్నారయ్యగారు! అంటూ కోదండ రామస్వామి పటం వద్ద నమస్కరిస్తూ నిలబడి ఆ పటంలోంచి ఫ్రేము కట్టించిన శిరిడీ సాయిబాబా పటం తీసి వీరికిచ్చారు. బాబా పటాన్ని మిగతా పటాలతోపాటు పూజచేయసాగారాదంపతులు.

**ఇలాగే బాబుగారిని ఒకసారి గుంటూరులో దర్శించిన శ్రీ భరద్వాజగారు, శ్రీ రాధాకృష్ణగార్లకు బాబుగారొక పెద్దసపోటా అంతటి పండిచ్చి 'అయ్యగారు! ఇది కాయ. పేరు రామకరుణామృతం. మూడు రోజులకు పండుతుంది. పండిన గుర్తేమిటంటే యిది విపరీతంగా ఘుమఘుమలాడుతుంది' అన్నారు. పండు సంచిలో వేసుకొని మరికొన్ని ఊర్లు దర్శించి బంధువుల యింట్లో జరిగే ఉపనయన కార్యక్రమానికి చేరారు వీరిరువురూ. సాయంత్రానికి విడిది గృహం సువాసనతో ఘుమాళించింది. అందరూ అది దేని వాసనో పరిశీలించి కూడా తెలుసుకోలేకపోయారు. శ్రీ భరద్వాజ గారికి బాబుగారి మాటలు గుర్తొచ్చి సంచిలో చూడగా ఆ వాసన ఆ పండుదేనట! ఇద్దరూ శుచిగా**

తాను ఆ సమయానికే వెంకన్న కోనేరులో స్నానం చేస్తున్నానని చెప్పి, వీరింటికేగాక అదే సమయానికి మొత్తం తొమ్మిదిమంది యింట తమ రూపంలో శ్రీ రాములవారే దర్శనమిచ్చారని చెప్పారు బాబుగారు.

**దాన్ని చెరిసగం తిన్నారు. గుజ్జు సీతాఫలంలోని గుజ్జులా వుండి రుచిగా తియ్యగా వున్నదట కానీ గింజలే లేవుట!**

1958వ సం॥లో ఒక సాయంత్రం 5గం॥లకు కృష్ణమూర్తిగారిని వారి భార్యనూ పేర్లతో పిలుస్తూ (బాబుగారెప్పుడూ వారిని అయ్యగారు, అమ్మగారు అని పిలచేవారు) యింటిలోనికి వచ్చి కూర్చున్నారు. 'ఆయన 7:30 వరకూ రారండి!' అన్న ఆమెతో బాబుగారు '10ని॥లలో వస్తారు చూడండి' అన్నారు. వీరలాగే ఆరోజు పని త్వరగా తెమలటంతో కాసేపటికి వచ్చారు. బాబుగారు వెళ్ళిపోవాలని తొందరపడుతున్నారు. దంపతులకు బాబుగారి ముఖంలో ఎన్నో అద్భుత దృశ్యాలు పొడసూపాయి. భక్తి ఆశ్చర్యాలతో దిగ్భ్రమచెందిన కృష్ణమూర్తిగారు 'మీరెవరు' అనడుగుతూ పాదాలంటి నమస్కరించబోగా చట్టునలేచి వెళ్ళిపోయారు బాబుగారు. వెనకనే వీరు వెళ్ళిన వారు కనిపించలేదు. మరుసటి దినం బాబుగారు కన్పించినప్పుడు వీరు ఆ విషయం అడుగగా తాను ఆ సమయానికే వెంకన్న కోనేరులో స్నానం చేస్తున్నానని చెప్పి, వీరింటికేగాక అదే సమయానికి మొత్తం తొమ్మిదిమంది యింట తమ రూపంలో శ్రీ రాములవారే దర్శనమిచ్చారని చెప్పారు బాబుగారు. వీరు విచారించగా నిజంగానే ఆరోజు శ్రీరాములువారు బాబుగారి రూపంలో సాయంత్రం 5 గం॥ సమయానికే:-

1. శ్రీ మండా జగన్నాధరావుగారి ఫాన్సీ షాపులో,
2. శ్రీ మోతే నరసింహారావుగారి మేడలో,
3. గీతాభవనంలో,
4. శ్రీ వాసుదేవాలయంలో,
5. శ్రీ జనార్ధనస్వామి కోవెలలో,
6. దే. కృష్ణమూర్తిగారింట్లో,
7. ఫోటోగ్రాఫరు భుజంగరావు గారి యింట్లో,
8. శ్రీ విస్సంశెట్టి ముత్యంగారింట్లో,
9. శ్రీ నక్కలగడ్డ తాతయ్యగారింట్లో- కన్పించారని ధృవపడింది.

ఇలా వీరికి బాబుగారు చూపిన నిదర్శనాలెన్నో! **ఈ లీల 'శ్రీగురుచరిత్ర'లో శ్రీ నృసంహ సరస్వతి చూపిన లీలను స్మృతికి తెస్తుంది.** 1973 సం॥లో విద్యానగర్ దర్శించినపుడు బాబుగారు ఆ వూరిలో ఒకచోట నిలుచుని అచ్చట మందిరం వస్తుందని చెప్పారు. అలానే అదే చోట ప్రస్తుతం సాయిమందిరం వచ్చింది. మరొకసారి శ్రీ భరద్వాజ గారు వీరిని ఏలూరులో దర్శించినప్పుడు 'రాములవారు మందిరానికి సాయం చెయ్యమంటున్నారయ్యా!' అన్నారు. 'బాబుగారు ప్రస్తుతం మీ ఆరోగ్యం బాగోలేదు. స్వస్థత చేకూరనివ్వండి ముందు' అన్నా వీరి మాటలు వినక ఊరిలో తిరిగి రూ. 2000/- విరాళం సేకరించి యిస్తూ, 'ఇక యిప్పుడు తిరగలేనయ్యా! తర్వాత వీలైనప్పుడు చూద్దాం' అన్నారట. కానీ 1979లో బాబుగారు రామైక్యత చెందటంతో అదే భరద్వాజ గారికి చివరి దర్శనమైంది.

మహారాజై కూడా బిచ్చగాని దుస్తులు ధరించగలవాడే మంచివాడు.

# మనకిదే శరణ్యం

- ఆచార్య ఎక్కిరాల భరద్వాజ

సద్గురువు ఆత్మనిష్ఠలో మౌనంగా కూర్చుని వుంటే సచ్ఛిష్యుల సంశయాలన్నీ వాటికై అవే సమసిపోయాయట. అదే చిత్రం! **ఆత్మజ్ఞానియైన సద్గురువు యొక్క బోధ వాస్తవానికి మౌనమే.** పరిపాకంలేని ఆరంభకుల కోసం మాత్రమే వాగ్రూపంలో ఆయన బోధిస్తారు. సాధకుల కొరకు తమ ఆచరణ ద్వారా బోధిస్తారు. శ్రీసాయినాథుని గురువు ఆత్మనిష్ఠులై మౌనంలో వుండేవారినుద్ధరించారని వారే చెప్పారు. అర్హులైన సచ్ఛిష్యులకు తమనుండి కూడ అలానే సత్ఫలితాన్ని పొందాలని వారే చెప్పారు. కాని అందుకెంతో పరిపాకం కావాలి. గుప్తంగా వుండిపోయిన ఆ గురువుకు శ్రీసాయి ఒక్కరే సచ్ఛిష్యులు కాగలిగారు. కాని, సాయికి అట్టి శిష్యులు ఒక్కరూ దొరకలేదట!

పామరులమైన మనకు శ్రీసాయి ఎన్నో ఎనలేని సత్యాలను బోధల రూపంలోనూ, తన ఆచరణ ద్వారానూ బోధించారు. వీటిని విస్మరించడం వలన ముముక్షువులుగా ప్రారంభించిన భక్తులు ఎన్నో భ్రమల విషవలయాలలో చిక్కుబడతారు. ఇతరులను పెడమార్గం పట్టిస్తారు. భగవంతుణ్ణి చేరడానికి ఎన్నో మార్గాలున్నాయని, తమను సేవించడంకూడా ఒక మార్గమనీ, అయితే ఆ మార్గంలో ఎన్నో భయంకరమైన మృగాలు ఎదురౌతాయని, వాటిని తట్టుకొని గమ్యం చేరాలంటే గురువు నాశ్రయించడం అవసరమనీ బాబా చెప్పారు. ప్రత్యక్షంగా గురువు లభ్యమైనపుడు వారి ఆజ్ఞననుసరించడం, లేనప్పుడు గురువుయొక్క బోధనలను, ఆచరణనూ అనుసరించాలని దీని భావం. ఇప్పుడు శ్రీ సాయి భౌతికంగా మనకు పరోక్షం గనుక మనకిదే శరణ్యం.

జై సాయి మాస్టర్ !!

ప్రియ గురు బంధువులారా! జగద్గురు శ్రీ సాయిమాస్టర్ ఆధ్యాత్మిక సేవలనందించడానికి, దివ్యజనని అలివేలుమంగమ్మ భరద్వాజుల ఆశీస్సులతో 'శ్రీ మంగ భరద్వాజ ట్రస్ట్' స్థాపించబడినది. సాయిమాస్టర్ భక్తులు, జిజ్ఞాసువులు-పుస్తకములు, ఫోటోలు మొదలగు వాటికొరకుగాని, విరాళములు మరియు Magazine Subscriptions మొదలగు అన్ని విషయములకు ఇకనుండి ఈ క్రింది అడ్రసును సంప్రదించగలరు. D.D.లు, M.O.లు కూడా ఈ క్రింది అడ్రసుకు పంపించగలరు.

**Sri Manga Bharadwaja Trust**,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone :040-20063300

**పూజ్య శ్రీ సాయిమాస్టర్ సేవాభిలాషులు యీ క్రింది చిరునామాలకు విరాళాలర్పించి తరించగలరు.**

**Magazine** మరియు **General Donations** ను **"Sri Manga Bharadwaja Trust"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Annadanam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Sai Master)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

**Ashramam Donations** ను **"Sri Manga Bharadwaja Trust (Peace Foundation)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల్వారా పంపగలరు

**Books order** ను **"Sri Manga Bharadwaja Trust (Publications)"**, payable at Hyderabad or Ongole పేరుపై M.O., D.D.ల ద్వారా పంపగలరు

పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతం-శ్రీ గురు చరిత్ర | 200-00 |
| శ్రీ సాయిబాబా జీవిత చరిత్ర | 90-00 |
| శ్రీ సాయి లీలామృతము | 70-00 |
| శ్రీ గురు చరిత్ర | 70-00 |
| శ్రీ సాయి సన్నిధి | 75-00 |
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | 75-00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము | 50-00 |
| సాయినాథ పూజ | 20-00 |
| సాయినాథ స్థవనమంజరి | 5-00 |
| శిరిడీ ఆరతులు | 6-00 |
| సాయిబాబాను సేవించడమెందుకు | 5-00 |
| సత్సంగము-భజన | 5-00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | 15-00 |
| విజ్ఞాన వీచికలు | 50-00 |
| పరిప్రశ్న | 40-00 |
| మతమెందుకు? | 30-00 |
| ఏది నిజం? | 30-00 |
| ధ్యానయోగ సర్వస్వం | 40-00 |
| బుద్ధధ్యాన హృదయం | 30-00 |
| దత్తావతార మహత్మ్యం | 40-00 |
| సంహితాయన గురు ద్విసాహస్రి | 80-00 |
| పురుషసూక్త రహస్యం | 30-00 |
| సాయిసూక్తి-ఆచార్యవాణి | 5-00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | 45-00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | 25-00 |
| అవధూత శ్రీ వెంకయ్యస్వామి | 40-00 |
| శ్రీ ఆనందమాయి అమ్మ | 30-00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | 45-00 |
| శ్రీ హజరత్ తాజుద్దీన్ బాబా చరిత్ర | 35-00 |
| స్వామి సమర్థ (అక్కల్కోట స్వామి) | 40-00 |

## ఇతర ప్రచురణలు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు | 55-00 |
| అవధూత చివటం అమ్మ | 40-00 |
| శ్రీ సిద్ధారూఢ స్వామి చరిత్ర | 40-00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు | 75-00 |
| మరో నందదీపం | 55-00 |
| ఆచార్య అమృత లేఖావళి | 40-00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ | 125-00 |

## BOOKS IN ENGLISH

| | |
|---|---|
| Sai Baba The Master | 110-00 |
| Guru Charitra | 70-00 |
| Supreme Master (Swami Samartha) | 60-00 |
| Sai Baba and His Teachings | 60-00 |
| Life and Teachings of Hazarat Tajuddin Baba | 60-00 |

## BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sai Baba (Hindi) | 100-00 |
| Sai Leelamrutham (Kannada) | 80-00 |
| Sai Baba Jeevitha Charitham(Malayalam) | 90-00 |
| Sai Baba Leelamrutham (Tamil) | 80-00 |
| Sri Guru Charitra (Hindi) | 50-00 |
| Sri Guru Chraitra (Kannada) | 99-00 |
| Shirdi Arathi (Tamil) | 6-00 |
| Stavana Manjari (Tamil) | 3-00 |

SRI GURUPADUKA PUBLICATIONS
c/o, **Sri Manga Bharadwaja Trust,**
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 68
Phone : 040-20063300

**Send DD in favour of "Sri Manga Bharadwaja Trust (Publications)", payable at Hyderabad OR Ongole**